## కమనీయం..

## గోదా కళ్యాణం



**టిటిడి శ్రీవారి దేవాలయంలో ఘనంగా గోదాదేవి అమ్మవారి కల్యాణం**

ధనుర్మాసంను పురస్కరించుకుని మంగళవారం ఉదయం లిబర్టి వద్దగల టిటిడి శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం (తిరు నియలం)లో గోదాదేవి అమ్మవారు-రంగనాయకుల స్వామి వారి కళ్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా కన్నుల పండువగా జరిగింది. ఉదయం 10 గంటలకు ముందే వేలాది మంది భక్తులు కళ్యాణ మహోత్సవానికి హాజరైనారు.

మిగతా సిటీ 2వ పేజీలో




## స్పౌజ్ బదిలీలు చేపట్టాలి

### ముగ్గులతో సిఎంకు పిల్లలు ఆవేదన

సైఫాబాద్, జనవరి 16 ప్రభాతవార్త: 13 జిల్లాల్లో స్పౌజ్ (ఉద్యోగ, ఉపాధ్యాయ) బదిలీలు చేపట్టాలని, సిఎం గారు మీరే మాకు దిక్కంటూ ఉపాధ్యాలు, ఉద్యోగుల పిల్లలు కనుమ పండువను పురస్కరించుకుని మంగళవారం ఇళ్ళ ముంగిట ముగ్గులు వేశారు. గత ప్రభుత్వం తీసుకువచ్చిన అశాస్త్రీయమైన విధానాల వల్ల ఉద్యోగస్తులైన భార్యా పిల్లలు వివిధ జిల్లాలకు విసిరి వేయబడ్డారని, మెమో నెంబర్ 1655 ప్రకారం భార్యాభర్తలు ఒకే జిల్లాలో పనిచేయాల్సి ఉండగా 19 జిల్లాల్లో స్పౌజ్ బదిలీలు జరిపి, 13 జిల్లాల్లో భర్త ఒక జిల్లా, భార్య మరొక, పిల్లలు ఇంకొక జిల్లా, వృద్ధులైన తల్లిదండ్రులు ఇంకొక చోట నివసిస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. రెండు సంవత్సరాలపాటు భార్యభర్తలు, పిల్లలు రోడ్డు ఎక్కి ధర్నాలు, నిరసన ప్రదర్శనలు చేపట్టినా గత ప్రభుత్వం పట్టించుకోలేదని ఆరోపించారు. గత ప్రభుత్వం 615 స్పౌజ్‌లు చేపట్టిందని, ఇంకా 1500 స్పౌజ్ బదిలీలు పెండింగ్‌లో ఉన్నాయని సిఎం రేవంత్‌రెడ్డి తమ ఆవేదనను అర్థం చేసుకుని సమస్యను తీర్చాలని వారు విజ్ఞప్తి చేశారు.



హైదరాబాద్ వార్త

# ప్రాణవాయువు పడిపోతోంది!

## అనారోగ్య సమస్యలున్న వారికి మరింత ప్రమాదకరం

**ప్రమాదకర స్థాయికి ఎయిర్ క్వాలిటీ**

**పొగమంచు, పొల్యూషన్‌తో తీవ్రతరం**

**ఇండస్ట్రీయల్ ఏరియాల్లో అధ్వాన పరిస్థితులు**

**మూడు రెట్లు ఎక్కువగా కాలుష్య కారకాల నమోదు**

**కాలుష్యం తీవ్రస్థాయికి చేరి వాతావరణంలో ప్రాణవాయువు పడిపోతోంది. నగరంలోఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ అన్ హెల్తి కండీషన్‌ను చూపిస్తోంది. సాధారణంగా ఉండే ఎయిర్ కన్‌స్ట్రక్షన్, ఇండస్ట్రీయల్ పొల్యూషన్‌కు పొగమంచు కూడా తోడవడంతో సమస్య మరింత తీవ్రంగా మారింది. ఇలాంటి వాతావరణం జనాల అనారోగ్యంతో ఉన్న వారికి మరింత ప్రమాదకరమని పర్యావరణవేత్తలు పేర్కొంటున్నారు. అస్తమా, ఇతర ఊపిరితిత్తుల సమస్యలు, గుండె జబ్బులు, షుగర్, బీపీ లాంటివి ఉన్నవాళ్లు జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు. ఇలాంటి వాతావరణం కారణంగా అరోగ్యంగా ఉన్నవారికి సైతం కొత్త జబ్బులు వచ్చే అవకాశాలున్నాయని హెచ్చరిస్తున్నారు.**



హైదరాబాద్, జనవరి 16 ప్రభాతవార్త : మరోవైపు వెహికల్ పొల్యూషన్‌తో ఎయిర్ క్వాలిటీ అధ్వాన్నంగా మారుతోంది. ఇండస్ట్రియల్ ఏరియాల్లో ఈ సమస్య అధికంగా ఉంటోంది. 50 నుంచి 100 మధ్యలో ఉండాల్సిన ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ సిటీలోని అనేక ఏరియాల్లో 100 నుంచి 150 మధ్య ఉంది. అన్ హెల్దీ ఎయిర్ క్వాలిటీని చూపిస్తోంది. డబ్ల్యూ హెచ్‌వో సూచించిన ఎయిర్ క్వాలిటీ పీఎం 2.5(కాలుష్య కారకాలు) ప్రమాణాల కంటే సిటీలో 3.1 రెట్ల ఎక్కువగా ఉన్నట్లు హైదరాబాద్ ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ సైట్‌లో పేర్కొంది.నగరంలోని జీడిమెట్ల, నాచారం, ఉప్పల్, పాశమైలారం, మల్లాపూర్, గడ్డిపోచారం, కుత్బుల్లాపూర్, చర్లపల్లి, గాజులరామారం, బాచుపల్లి, పటాన్‌చెరు వంటి పలు ప్రాంతాల్లో ఫార్మసీకి చెందిన బల్క్ డ్రగ్ ఫ్యాక్టరీలు, కెమికల్ ఫ్యాక్ట రీల నుంచి వెలువడే కెమికల్స్ కారణంగా ఈ ప్రాంతాల్లో పరిస్థితి దారుణంగా ఉంటోంది.

**ఫ్యాక్టరీల నుంచి గ్యాస్, పొగ..** ఫ్యాక్టరీల నుంచి వెలువడే గ్యాస్, పొగ కలిసి ఏర్పాటే పొగ, దీంతో పాటు వెహికల్స్ నుంచి వచ్చే పొగ కారణంగా చాలా మంది ఊపిరితిత్తుల సంబంధిత సమస్యల బారిన పడుతున్నారని డాక్టర్లు చెపుతున్నారు. గతంలో పోలిస్తే ప్రస్తుతం ఈ తరహా కేసులు పెరుగుతున్నాయని పేర్కొంటున్నారు. వీటితో పాటు తీవ్రమైన తలనొప్పి, సైనస్, కంటి సమస్యలు, వీక్ నెస్ వంటి హెల్త్ ఇష్యూస్ వస్తున్నాయని బాధితులు పేర్కొంటున్నారు. చలికాలం కావడంతో చర్మ సంబంధిత వ్యాధులైన అలర్జీ, వాంతులు వంటి సమస్యలు వస్తున్నాయని అంటున్నారు. ముఖ్యంగా వృద్ధులు శ్వాస తీసుకోవడంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సాయంత్రం అయితే బయటకు రాలేకపోతున్నామని కిటికీలు, తలుపులు మూసుకొని ఉంటున్నామని, సమస్య నుంచి తప్పించుకోలేక పోతున్నామని వాపోతున్నారు.

**వెహికల్స్ ఎక్కువతుండటంతో..** వెహికల్స్ సంఖ్య పెరగడమే పొల్యూషన్‌కు ప్రధాన కారణమని పర్యావరణ వేత్తలు అంటున్నారు. నగరంలో కోటికిపైగా జనాభా ఉండగా,వాహనాల సంఖ్య సుమారు 80లక్షలకు చేరింది. వీటిలో 70 శాతం వరకు టూవీలర్స్ ఉండగా, 10 శాతం కార్లు ఉంటాయని, మిగతావి ఆటోలు ఇతరత్రా వెహికల్స్ అని ట్రాన్స్ పోర్టు అధికారులు పేర్కొంటున్నారు. ప్రతి ఏడాది బైక్‌ల రిజిస్ట్రేషన్ 15శాతం, కార్ల రిజిస్ట్రేషన్లు 10 శాతం పెరుగుతున్నాయని పేర్కొంటున్నారు. ఈ వెహికల్స్ నుంచి వెలువడే పొగతో గాలిలో కాలుష్య తీవ్రత పెరిగిపోతోంది.

**రెసిడెన్షియల్ ఏరియాల్లో చెత్తను తగులపెట్టొద్దు..** ఇండస్ట్రీయల్ ఏరియాలో వెహిల్స్ పరిశ్రమల నుంచి వెలువడే కెమికల్ గ్యాస్ వల్ల అక్కడి జనం అనారోగ్యాల బారిన పడుతున్నారు. మరోవైపు జిహెచ్‌ఎంసి, శివారు ప్రాంతంలోని మున్సిపల్ ఏరియాల్లో చెత్తను కాలుస్తున్నారు. దీనివల్ల కూడా పొల్యూషన్ ఏర్పడుతోంది. ప్రభుత్వం వీటిని దృష్టిలో పెట్టుకొని చర్యలు చేపట్టాలని, పాత వెహికల్స్ కారణంగా రెట్టింపు పొల్యూషన్ అవుతోంది. పాత వెహికిల్స్‌ను తీసేయాలని 2003లో సుప్రీంకోర్టు చెప్పినప్పటికీ అది ఇంప్లిమెంట్ కావడంలేదని పలువురు పర్యావరణవేత్తలు పేర్కొంటున్నారు.

## అజ్మీర్ దర్గాలో ఛాదర్ సమర్పణ



అజ్మీర్ దర్గాకు సమర్పించే ఛాదర్‌ను మీర్ ఫిరాసత్ అలీ బాక్రీకి అందజేస్తున్న కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి,ఎంపి డాక్టర్.కె.లక్ష్మణ్

యాకుత్‌పుర,జనవరి 16 ప్రభాతవార్త : రాజస్థాన్‌లోని అజ్మీర్ దర్గాలో ఛాదర్‌ను సమర్పించనున్నామని చార్మినార్ నియోజకవర్గానికి చెందిన బిజెపి మాజీ అధికార ప్రతినిధి మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ అన్నారు. కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి,రాజ్యసభ సభ్యులు కె.లక్ష్మణ్‌లు ఛాతర్‌ను తనకు అందజేశారని బాక్రీ తెలిపారు. క్వాజా మొహియుద్దీన్ చిష్టీ ఉర్సు ఉత్స వాలు సందర్భంగా ఛాదర్‌ను అజ్మీర్ దర్గాలో సమర్పించనున్నామని మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ వెల్లడించారు.

## అంతర్జాతీయ తెలుగు సాంస్కృతిక సంఘం ఆధ్వర్యంలో సన్మానం

చిక్కడపల్లి, జనవరి 16 ప్రభాతవార్త: అంతర్జాతీయ తెలుగు సాంస్కృతిక సంఘం(ఇట్క్లా) అధినేత డాక్టర్ కె.ధర్మారావు ఆధ్వర్యంలో సుప్రసిద్ధ సినీ రచయిత, దర్శకుడు, తెలుగు సినీ రచయితల సంఘం అధ్యక్షుడు డాక్టర్ వడ్డేపల్లి కృష్ణకు 'ఇట్క్లా ఫాస్ సంక్రాంతి సినీ పురస్కారం'ను అందించే కార్యక్రమం జరిగింది. శనివారం జరిగిన కార్యక్రమంలో ఈ అవార్డులను వివిధ రంగాలకు చెందిన వారికి అందించారు. అదే విధంగా జాతీయ రైల్వేల బహు ముఖోన్నత కార్మిక నేత యుగంధర్ పట్నాయక్‌కు 'ఇట్క్లా సాంక్రాంతి సేవా పురస్కారం'ను అందించి గౌరవించారు. అంతర్జాతీయ బాలల చలనచిత్రోత్స వాల పూర్వ కోఆర్డినేటర్ ఎంఎస్.ప్రసాద్, రిటైర్డ్ లెఫ్టినెంట్ కల్నల్ డాక్టర్ భాస్కర్‌రెడ్డి, టీవీ నటుడు రాజు, ఫిజియోథెరపిస్ట్ విజయకుమార్ తదితరులు అవార్డుగ్రహీతలను అభినందించారు.ఈ కార్యక్రమం లో జీఎం సూరపనేని ప్రసాద్ పాల్గొన్నారు.

## ప్రైవేట్ ఆసుపత్రి వైద్యుల నిర్లక్ష్యంతో చిన్నారి మృతి

**ఆసుపత్రి వద్ద ఆందోళనకు దిగిన బంధువులు**

గన్‌ఫౌండ్రి ,జనవరి 16ప్రభాతవార్త: అబిడ్స్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో డాక్టర్ నిర్లక్ష్యం మూలంగా ఓ చిన్నారి మృతి చెందిన సంఘటన అబిడ్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.పోలీసులు, బాధితురాల కథనం ప్రకారం.. మహబూబ్‌నగర్ టౌన్‌కు చెందిన సాయికుమార్ భార్య అనుషా గర్భవతి ప్రసవ నిమిత్తం నాలుగు రోజుల క్రితం అబిడ్స్‌లోని ఓ ఆసుపత్రిలో చేరారు.మూడు రోజుల క్రితం బాబుకు పండటి బిడ్డకు జన్మనించింది.మంచి ఆరోగ్యంగా జన్మనించిన శిశువు మంగళవారం ఉదయం మరణించినట్లు వైద్యులు ధృవీకరించారు. బాబు మృతికి కారణాలు అడుగిన బంధువులు డోస్ ఎక్కువడం వల్లనే మృతి చెందారు.మాది పొరపాటు వల్ల చనిపోయాడని డాక్టర్లు ఒప్పుకున్నట్లు కోవడంతో బంధువులు ఒప్పుకున్నారు. 3.5కెజి బరువుతో జన్మించి ఆరోగ్యంగా ఉన్న బాబు ఎలా చనిపోయాడని తెలుపాలని ఆందోళనకు దిగారు. సమాచారం అందుకున్న అబిడ్స్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## జయపాల్‌రెడ్డి జయంతిని

**అధికారికంగా నిర్వహించడం హార్షణీయం**

చిక్కడపల్లి, జనవరి 16 ప్రభాతవార్త: మాజీ కేంద్ర మంత్రి, పార్లమెంటేరియన్ ఎస్.జైపాల్‌రెడ్డి జయంతి, వర్ధంతి కార్యక్రమాలను అధికారికంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించడం పట్ల డెవలప్‌మెంట్ సొసైటీ ఫర్ ది డీఫ్ జాతీయ కన్వీనర్ వల్లభనేని ప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం బాగ్‌లింగంపల్లిలోని సంఘం కార్యాలయంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ఉత్సవాలను నిర్వహించడంతో పాటు జైపాల్‌రెడ్డి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని, ఆ మహనీయుడి పేరుతో ఒక పథకాన్ని ప్రవేశపెట్టాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## పండగ పూట

# మృత్యుపేాల!

**నగరంలో విషాదం ప్రాణాలు తీసిన గాలిపటాలు**

**మంజాతో ఒకరు.. బిల్డింగు పైనుంచి పడి మరొకరు.. కరెంట్ షాక్‌తో మరొకరు.. జరిగిన మరణాలు కుటుంబాలో తీరని విషాదాన్ని నింపాయి.**

హైదరాబాద్, జనవరి 16 ప్రభాతవార్త : పండుగ పూట నగరంలో విషాదం నింపింది. సంక్రాంతి పండగ పలువురి కుటుంబాల్లో పెను విషాదాన్ని నింపింది. ఎంతో ఉత్సాహంతో గాలిప టాలు ఎగురవేసిన పలువురు యకువులు, చిన్నారులు అనుకోకుండా మృత్యువుబారిన పడ్డారు. కొందరు గాలిపటాలు విద్యుత్ తీగలకు ఇరుక్కుని విద్యుత్ షాక్‌తో ప్రాణాలు కోల్పోగా, మరికొందరు గాలిపటాలు ఎగురవేస్తూ భవనాల పైనుంచి పడి మృతిచెందారు. బొల్లారం పోలీస్‌స్టేషన్ పరిధిలోని యాప్రాల్ లో పతంగులు ఎగురవేస్తూ ఓ యువకుడు బలి అయ్యాడు. అలాగే యాప్రాల్‌లోనే గాలిపటం ఎగురవేస్తూ భువన్ సాయి అనే బాలుడు నాలుగవ అంతస్తు పై నుంచి కింద పడ్డాడు. తీవ్రంగా గాయపడిన బాలుడిని ఆస్ప త్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.ఇదు మధురా నగర్ లోనూ విషాదం చోటు చేసు కుంది. పతం గులు ఎగురవేస్తూ చౌహాన్ దేవ్ (23) అనే యువకుడు మృతి చెందాడు, మధురానగర్ రహ్మత్‌నగర్‌లో ఐదం తస్తుల భవనం పైనుంచి పడిపోవడంతో చౌహా న్‌దేవ్ అక్కడికక్కడే మృతి చెందాడు, అయితే చౌహాన్ మృతిపై తల్లితండ్రులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. చౌహాన్ స్నేహితులపై తల్లిదం డ్రులు అనుమానం వ్యక్తం చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మరో వేర్వేరు ఘటనలో ముగ్గురు మృతి చెందిన విషయం తెలిసిందే. చైనా మంజా దారం తగిలి గొంతుపై బలమైన గాయం కావడంతో ఓ ఆర్మీ జవాన్ మృతి చెందిన ఘటన హైదరాబాద్ లంగర్‌హౌజ్‌లో చోటు చేసుకుంది. వైజాగ్‌కు చెందిన కె.కోటేశ్వర్‌రెడ్డి (28) గోల్కొండ మిలటరీ ఆస్పత్రిలోడ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అత్తాపూర్‌లోని తన ఇంటికి వెళ్తుండగా లంగర్‌హౌజ్ ఫ్లైఓవర్‌పై మాంజా తన గొంతుకు తగిలింది. దీంతో కోటేశ్వ ర్‌రెడ్డి మెడపై బలమైన గాయం తగిలి రోడ్డుపై కుప్పకూలిపోయింది. అతన్ని వెంటనే ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మరో ఘటనలో..గాలిపటం ఎగురవేస్తూ కాష్ అనే 20 సంవత్సరాల ఆకాష్ అనే యువ కుడు మృతి చెందిన ఘటన మేడ్చల్‌లో చోటు చేసుకుంది. గాలిపటం ఎగురవేస్తూ, ప్రమాదవశాత్తు భవనం పై నుండి ఆకాష్ పడి మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. మరోచోట గాలిపటం ఎగురవే స్తూ ఓ బాలుడు భవనంపై నుంచి కిందపడి దుర్మరణం పాలయ్యాడు. ఏపీలోని ఒంగోల్ జిల్లా అద్దంకి గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు.. కుమారుడు శివకుమార్ (13) నాగోల్‌లోని ప్రభుత్వ పాఠశా లలో ఎనిమిదవ తరగతి చదువుతున్నా డు. పక్క బిల్డింగ్‌పైకి వెళ్లి తోటి స్నేహితులతో గాలిపటం ఎగురవేస్తున్నాడు. అంతలో ఓ కుక్క అతడి మీదకు రావడంతో.. దాని బారి నుంచి తప్పించుకునేందుకు వెనక్కి ఎవళ్తూ భవనంపై నుంచి పడిపోయాడు. తీవ్ర గాయాలతో బాలుడు శివకుమార్ చనిపోయాడు.

**చైనా మాంజా విక్రయం..**
**18 మందిపై కేసులు నమోదు**

నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మంగళ్‌హాట్‌లో పోలీసులు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహిం చారు. చైనా మాంజాను విక్రయిస్తున్న 18 మందిపై పోలీసులు కేసులు నమోదు చేశారు.చైనా మాంజా విక్రయిస్తున్నట్లు పోలీసులకు పక్కా సమాచారం అందింది. దీంతో ఆ ఏరియాలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించి చైనా మాంజాను స్వాధీనం చేసుకున్నారు. చైనా మాంజాను విక్రయిస్తున్న 18 మందిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. వీరంతా ఢిల్లీ నుంచి చైనా మాంజా తీసుకొచ్చి విక్రయిస్తున్నట్లు పోలీసులు విచారణలో తేలింది. గత మూడు రోజుల నుంచి మాంజా దుకాణాల్లో పోలీసులు తనిఖీలు నిర్వహించారు.

**రహ్మత్‌నగర్‌లో గాలిపటం ఎగురవేస్తూ భవనం పైనుంచి కింద పడి మృతి చెందిన చౌహాన్ శ్రీదేవ్**



**యూసుఫ్‌గూడ..** సంక్రాంతి పండుగ రోజున గాలిపటం ఎగురవేస్తూ ఓ యువకుడు అనుమానా స్పదంగా మృతిచెందాడు. మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో రహ్మత్ నగర్‌లో ఈసంఘటన చోటుచేసుకుంది. మధురా నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రహ్మత్‌నగర్‌లో చౌహాన్ శ్రీదేవ్(21) సోమవారం రాత్రి ఓ భవనం 3వ అంతస్తు లో గాలిపటం ఎగురవేస్తూ ఉన్నాడు. ఈక్రమంలో అక్కడి నుండి కింద పడ్డాడు. వెంటనే ఆయువకుడిని ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు. తల్లిదండ్రుల ఫిర్యాదుతో అనుమానస్పద మృతిగా మధురానగర్ పోలీసులు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## పచ్చిమాంసం ఎందుకు తింటున్నావ్ అన్నందుకు కత్తితో దాడి..



మృతి చెందిన కాంబ్లె అజయ్

అడ్డగుట్ట, జనవరి 16 ప్రభాతవార్త: పచ్చి మాంసం ఎందుకు తింటున్నావని ప్రశ్నించినందుకు ఉన్మాది ఓ యువకుడిని కత్తితో దాడి చేశాడు. అడ్డువచ్చిన మృతుడి భార్యకు స్వల్ప గాయాలయ్యాయి. ఈ సంఘటన తుకారంగేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తుకారం గేట్ గోల్‌బావి ప్రాంతానికి చెందిన కాంబ్లె అజయ్(23) భారత్‌బ్యాండ్‌లో పనిచేసేవాడు. సోమవారం ఉదయం గోల్‌బావి ప్రాంతానికే చెందిన చారి (43) ఇంటివెలుపల కూర్చొని పచ్చిమాంసం తింటుండగా గమనించిన అజయ్, అతని భార్య ప్రియాంకలు అడిగారు. దీంతో కోపోద్రిక్తుడైన చారి పక్కనే ఉన్న కూరగాయలు కోసే కత్తితో అజయ్‌ని కడుపులో పొడిచాడు. అడ్డువచ్చిన ప్రియాంకపై కూడా దాడి జరిపాడు. తీవ్రంగా గాయపడ్డ అజయ్‌ని స్థానికులు గాంధీ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. అజయ్‌కి 8నెలల కుమార్తె అక్షిత కూడా ఉంది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## యువత సన్మార్గంలో ముందుకు నడవాలి

బేగంబజార్, జనవరి 16 ప్రభాతవార్త: దేశ యువత భారత రాజ్యాంగాన్ని అనుసరించి సత్ప్రవర్తన, సన్మారంలో ముందుకు నడువాలని ప్రజా ఏక్తాపార్టీ అధినేత బోనాల శ్రీనివాస్ గుప్త పిలుపు నిచ్చారు. ఆయన ధర్మసమాజ్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ విశారధన్ మహారాజ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు.

## ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

**కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి**



చెక్కులు పంపిణీ చేస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

ముషీరాబాద్, జనవరి 16, ప్రభాతవార్త: ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన పేదలంతా సద్వినియోగం చేసుకోవాలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సూచించారు. మంగళవారం కాచిగూడలోని మహంకాళి అమ్మవారి గుడివద్ద ఎస్‌బీఐ బర్‌కత్‌పురా బ్రాంచి నుండి ముద్ర లోను పథకం ద్వారా లబ్ధిపొందిన మహిళలకు ఆయన చెక్కులు అందచేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పేదల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం ఎన్నో పథకాలు రూపొందించి, అమలు చేస్తోందని వివరించారు. అనంతరం ఉచిత వైద్య శిబిరంను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉజ్వల గ్యాస్ దరఖాస్తు పత్రాలు, జీరో బాలెన్స్ అకౌంట్ దరఖాస్తులు, ఆధార్ అప్‌డేట్ దరఖాస్తులను అందచేశారు. ఈ కార్యక్రమంలో కార్పోరేటర్ కన్నె ఉమ రమేష్‌యాదవ్, బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షులు ఎన్.గౌతంరావు, మాజీ మంత్రి కృష్ణయాదవ్, ఉపాధ్యక్షులు కన్నె రమేష్‌యాదవ్, అమృత, ఎస్‌బీఐ బ్రాంచి మేనేజర్ సంధ్య, డాక్టర్ మనోజ్‌రెడ్డి, నాయకులు కృష్ణకుమార్, సుభాష్‌పటేల్, క్షరసాగర్, నర్సింగ్‌యాదవ్, నందు, మల్లికార్జున్, సురేష్, సంతోష్, కృష్ణ, లావణ్య, రవియాదవ్, సారిక, తార, శాంతాబాయి తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాల స్థాయి నుండే పిల్లలకు కళల్లో శిక్షణ ఇవ్వాలి

**రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య**

రవీంద్రభారతి, జనవరి 16 ప్రభాతవార్త : ప్రపంచం లోకెల్లా భారతీయ సంస్కృతి, శాస్త్రీయ, జానపద, సంప్రదాయ కళలు చాలా గొప్పవిగా పేరొందాయని, మన పిల్లలకు పాఠశాలస్థాయి నుండే వివిధ కళల్లో విధిగా పాఠ్యాంశంగా చేర్చి, నిష్ణాతులైన గురువులతో శిక్షణ ఇప్పించి దేశం గర్వించదగ్గ ప్రఖ్యాత కళాకారులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై, పిల్లల తల్లిదండ్రులపై ఉందని రాజ్యసభ సభ్యుడు, బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షురాలు ఆర్.కృష్ణయ్య అన్నారు. పిల్లలకు ఆటపాట, శాస్త్రీయ నృత్యప్రదర్శనల ద్వారా శారీరక వ్యాయామంతోపాటు జ్ఞాపకశక్తి, మానసిక వికాసం, మనోధైర్యంలతో సంపూర్ణ ఆరోగ్య, చైతన్యవంతులుగా అన్నిరంగాల్లో ముందంజవేయడానికి ఎంతగానో ఉపకరిస్తామని ఆయన స్పష్టం చేశారు. రవీంద్రభారతి ప్రధాన మందిరంలో మంగళవారం ఉదయం నుండి నృత్యమాల నాట్యకళ వెల్ఫేర్ సొసైటీ, సిరి ఆర్ట్స్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో సంస్థ అధినేతలు వీరేశ్‌యాదవ్, డా. ఏకవీర, వారణాసి లక్ష్మి నిర్వహణలో సంక్రాంతి పర్వదినాలను పురస్కరించుకొని జరిగిన సంక్రాంతి సంబరాలు 2024 కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎంపి ఆర్.కృష్ణయ్య విశిష్ట అతిథులు సరస్వతీ ఉపాసకుడు దైవజ్ఞశర్మ, నాట్యగురువు పసుమర్తి రామలింగశాస్త్రి కలిసి వందలాదిమంది కళాకారులు వివిధ అంశాలతో అద్భుతంగా ప్రదర్శించిన శాస్త్రీయ, సంప్రదాయ, జానపద నృత్యాలను తిలకించి కళాకారులను అభినందించి జ్ఞాపికలను ప్రదానంచేసి శుభాశీస్సులు, సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఉభయ తెలుగురాష్ట్రాల నుండి ఎంతో ఆసక్తి, ఆశతో విచ్చేసిన కళాకారులు సమయాభావమంటూ దూరప్రాంతాల నుండి వ్యయప్రయాసలను భరించి ఇక్కడకువస్తే తమ కళాప్రదర్శనలకు అవకాశమివ్వలేదంటూ తల్లిదండ్రులతో కలిసి తీవ్ర నిరసన, గొడవలకు దిగడం సర్వసాధారణంగా తయారవ్వడం గమనార్హం, గర్హనీయమని ఆహుతులు ఆవేదన వ్యక్తపరిచారు.




సంక్రాంతి పర్వదినం సందర్భంగా మహిళలు నార్సింగి, మునగనూర్ ప్రాంతాల్లో ఇళ్ల ముందు వేసుకున్న రంగుల హారివిల్లులు



## దేశాన్ని రక్షించడానికి దైవదూతలు లాంటి వాళ్లు సైనికులు



కల్నల్ లంకా శ్రీనివాస్‌ను దంపతులను ఘనంగా సత్కరిస్తున్న పూర్వ సభాపతి సిరికొండ మధుసూధనాచారి

**ఎమ్మెల్సీ సిరికొండ మధుసూధనాచారి**

బేగంపేట జనవరి 16, ప్రభాతవార్త : దేశాన్ని రక్షించడానికి దేవుడు నియమించిన దైవదూతలు సైనికులు అని తెలంగాణా పూర్వ సభాపతి ఎమ్మెల్సీ సిరికొండ మధుసూధనాచారి అన్నారు. సోమవారం బేగంపేట కుందన్‌బాగ్‌లో ప్రముఖ సాంస్కతిక సంస్థ ఆకృతి ఆధ్వర్యంలో ,జాతీయ సైనిక దినోత్స వాన్ని పురస్కరించుకొని భారత సైన్యంలో కల్నల్‌గా విశిష్ట సేవలు అందించి సేవా మెడల్ అందుకున్న లంకా శ్రీనివాస్ దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా పాల్గొన్న మధుసూధనా చారి కవి కాళోజీ ,పుట్టుక నీది. చావునీది. బతుకు దేశానిది అన్న కవితా పంక్తులను ఉదహరించారు. ఈనాటి యువత సైన్యంలో పనిచేయడానికి చొరవ చూపాలన్నారు. విభిన్న,ప్రతికూల పరిస్థితుల్లో సైన్యం దేశ రక్షణలో అనుక్షణం అప్రమత్తతతో పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ అధ్యక్షుడు కొత్త వెంకటేశ్వరరావు,ఆకృతి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## విఎస్టీ కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా ముందుకు



వి.శ్రీనివాస్‌రెడ్డిని సత్కరించిన దృశ్యం

**యూనియన్ అధ్యక్షుడు వి.శ్రీనివాస్‌రెడ్డి**

చిక్కడపల్లి, జనవరి 16 ప్రభాతవార్త: విఎస్టీ కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా తాను పనిచేస్తానని యూనియన్ అధ్యక్షుడు, మాజీ కార్పొరేటర్ వి. శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. విఎస్టీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో విజయవంతంగా వివిధ యూనియన్‌లకు అధ్యక్షులుగా ఎన్నికవుతూ వస్తున్న వి.శ్రీనివాస్‌రెడ్డిని సత్కరించే కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి ప్రభాకర్, యూనియన్ నాయకులు బాబీ, రవియాదవ్, నరేందర్‌గౌడ్, రణధీర్‌రెడ్డి, మధు, సత్యనారాయణ, మల్లేష్, రాములు తదితరులు పాల్గొన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా విఎస్టీ కార్మికులకు చారిత్రాత్మకమైన అగ్రిమెంట్ చేసి మంచి వేతనాన్ని అందించడంతో పాటు వారి సమస్యలను పరిష్కరించడం జరిగిందన్నారు. ఇంకా పెండింగ్‌లో ఉన్న సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని పరిష్కరించుకుంటూ వస్తున్నామన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నట్లు వివరించారు. అంతకుముందు వివిధ దేవాలయాల్లో ప్రత్యేక పూజలు విఎస్ఆర్ నిర్వహించారు.

## ఎన్టీఆర్‌కు నివాళులర్పించి.. స్మరించుకుందాం

**టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు పి.సాయిబాబా, ప్రధాన కార్యదర్శులు నల్లెల్ల కిషోర్, బాలరాజ్‌గౌడ్**

ముషీరాబాద్, జనవరి 16, ప్రభాతవార్త: ఈనెల 18వ తేదీ గురువారం స్వర్గీయ ఎన్టీ రామారావు 29వ వర్ధంతి సందర్భంగా ఆయనకు ఘనంగా నివాళులర్పించి, ఆయన సేవలను స్మరించుకుందామని టీడీపీ పార్లమెంట్ అధ్యక్షులు పి.సాయిబాబా, ప్రధాన కార్యదర్శులు నల్లెల్ల కిషోర్, పి.బాలరాజ్‌గౌడ్‌లు పిలుపునిచ్చారు. మంగళవారం లోయర్‌ట్యాంక్‌బండ్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఎన్టీఆర్ వర్ధంతి రోజు ఉదయం 9గంటలకు ఎన్టీఆర్ ఘాట్ వద్ద నివాళి కార్యక్రమం ఉంటుందని, 9.30 నిమిషాలకు రసూల్‌పురా వద్ద ఎన్టీఆర్ అమరజ్యోతి ర్యాలి, 10 గంటలకు జిల్లా పార్టీ కార్యాలయంలో నివాళి, 10.30 నిమిషాలకు ముషీరాబాద్ నియోజకవర్గంలోని అశోక్‌నగర్ చౌరస్తాలో నివాళి కార్యక్రమం, అనంతరం జిల్లా కార్యాలయంలో రక్తదాన శిబిరం, దుప్పట్ల పంపిణీ కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. నగరంలో నిర్వహిస్తున్న ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమాలలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ఎన్టీఆర్ అభిమానులు పెద్ద ఎత్తున హాజరవ్వాలని కోరారు.

### హైదరాబాద్ మెట్రో రైల్వే ప్రాజెక్టుకు

## జైపాల్‌రెడ్డి చేసిన సహకారం ఎంతో ఉంది

**హెచ్ఎంఆర్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎన్‌విఎస్.రెడ్డి**

హైదరాబాద్, జనవరి 16, ప్రభాతవార్త : ప్రతిష్టాత్మకంగా చేపట్టి పూర్తి చేసిన హైదరాబాద్ మెట్రో రైల్వే ప్రాజెక్టుకు నిధులు, ఇతర అనుమతులు రావడంలో మాజీ కేంద్ర మంత్రి ఎస్.జైపాల్‌రెడ్డి కీలకపాత్ర పోషించారని హెచ్ఎంఆర్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎన్‌విఎస్.రెడ్డి అభిప్రాయపడ్డారు. మంగళవారం నెక్లెస్‌రోడ్స్‌లోని స్ఫూర్తిస్థల్ వద్ద మాజీ కేంద్రమంత్రి ఎస్.జైపాల్‌రెడ్డి జయంతి సందర్భంగా డాక్టర్ ఎన్‌విఎస్.రెడ్డి ఆ మహనీయుడి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించి ప్రసంగించారు. హైదరాబాద్ మెట్రోరైల్వే ప్రాజెక్టును ప్రభుత్వం మంజూరు చేయడంతో కీలకపాత్ర పోషించారని, ముఖ్యంగా వయబిలిటీ గ్యాప్‌ఫండింగ్ ఆమోదం వంటి కీలకమైన అనుమతులు రావడంతో ఆయన విశేషంగా కృషి చేశారన్నారు. ఒక సందర్భంలో స్టాండర్డ్ గేజ్(4'8)ను అనుసరించాలనే మెట్రోరైల్ కార్పొరేషన్‌ల ప్రతిపాదనను భారతీయ రైల్వే శాఖ వ్యతిరేకించడం, అనంతరం బ్రాడ్‌గేజ్(5'6)ను స్వీకరించాలని పట్టుబట్టడం, మొదట్లో ఢిల్లీ, హైదరాబాద్, ముంబై, బెంగళూరు మెట్రో ప్రాజెక్టులు 'గేజ్' సమస్యలపై నిలిచిపోయాయని తెలిపారు. ఇటువంటి క్లిష్ట సమయంలో ఆ సమయంలో కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రిగా ఉన్న ఎస్.జైపాల్‌రెడ్డి ఏ విధంగా అప్పటి కేంద్ర మంత్రుల బృందానికి నాయకత్వం వహించిన శరద్‌పవార్, పి.చిదంబరం, లాలూప్రసాద్‌యాదవ్‌లకు నమ్మకమైన ప్రజెంటేషన్ చేయడానికి తనకు ఎస్.జైపాల్‌రెడ్డి మార్గదర్శనం చేశారని అన్నారు. మెట్రో ప్రాజెక్టులకు స్టాండర్డ్ గేజ్ అవసరం గురించి సరైన వివరించడం మూలంగా చివరకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిందన్నారు. ఇటువంటి అంశాలపై ఆ సమయంలో కేంద్ర మంత్రిగా ఉన్న ఎస్.జైపాల్‌రరెడ్డి బలమైన మద్దతు వల్లే హైదరాబాద్ మెట్రో నేడు దేశంలోని అన్ని ఇతర మెట్రోరైల్ ప్రాజెక్టులను ఫలవంతం చేయడానికి పునాది వేసిందని డాక్టర్ ఎన్‌విఎస్.రెడ్డి వివరించారు.

## జయ శంకర్ విగ్రహాన్ని ధ్వంసం చేయడం హేయమైన చర్య : కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్



జయశంకర్ విగ్రహాన్ని ధ్వంసం చేసినవారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరుతున్న కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్

కెపిహెచ్‌బి కాలనీ, జనవరి 16, ప్రభాతవార్త : శేరిలింగంపల్లి నియోజకవర్గం ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మబండలో తెలంగాణ ఉద్యమ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహాన్ని ధ్వంసం చేయడం హేయమైన చర్య అని ఆల్విన్‌కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ తీవ్రంగా ఖండించారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని తట్టిలేపిన ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ విగ్రహాన్ని ఒక గుర్తు తెలియని వ్యక్తి ధ్వంసం చేయడం విచారకరమన్నారు. మద్యం మత్తులో ఊగుతూ, పిచ్చి పిచ్చి గెంతులు వేస్తూ, పెద్ద బండరాయితో జయశంకర్ విగ్రహాన్ని పగలగొట్టి పైశాచిక ఆనందం పొందదాని పేర్కొన్నారు. ఈ విషాదకరమైన సంఘటనను ఖండిస్తూ డివిజన్ కార్పొరేటర్ గౌడ్ ఘటన స్థలానికి చేరుకుని పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ తొమ్మిదిన్నర ఏళ్ళ పాలనలో చిన్న చిన్న పొరపాట్లు కూడా జరగకుండా జాగ్రత్త పడ్డామని, విగ్రహాన్ని పగలగొట్టిన వ్యక్తి ఎవరైనా సరే కఠినంగా శిక్షించాలని అన్నారు. బిఆర్ఎస్ పాలనలో పార్టీలకు అతీతంగా మహాత్మాగాంధీ, ఇందిరాగాంధీ, ఎన్టిఆర్ వంటి ఎంతోమంది మహానుభావుల విగ్రహాలను ఆల్విన్‌కాలనీ డివిజన్‌లో ప్రతిష్టించడం జరిగిందని గుర్తు చేశారు. పోలీస్ శాఖ వారు ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా పారదర్శకంగా దర్యాప్తు చేసి నిందితున్ని విచారించి శిక్షించాలని డిమాండ్ చేస్తూ జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

## అనందోత్సవాల మధ్య సంక్రాంతి



అఫ్జల్‌గంజ్, జనవరి 16ప్రభాతవార్త: సంక్రాంతి పండుగను ప్రజలు ఆనందోత్స వాల మధ్య జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుందని తెలంగాణ భజరంగ్ సేనా అద్యక్షులు ఎన్.ఆర్. లక్ష్మన్‌రావు గుప్త అన్నారు. పండుగను పురస్కరిం చుకుని డివి జన్ పరిధిలోని చిన్నారులు, కుటుంబ సభ్యులతో కలిసి గుప్త గాలిపటాలను ఎగురవేశారు.



## అయ్యప్పస్వామి దర్శించుకున్న ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్

కంటోన్మెంట్, జనవరి 16 ప్రభాతవార్తః కంటోన్మెంట్‌లో బొల్లారం అయ్యప్పస్వామి వారిని ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ దర్శించుకున్నారు. స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు జరిపారు. ఈ కార్యాక్రమంలో ఆలయ మేనేజర్ రంజన్, ట్రెజరర్ పద్మనాభ నంబియార్, సుబ్రహ్మణ్యస్వామి టెంపుల్ మారేడ్‌పల్లి ట్రస్టీ బోర్డు బోర్డు మెంబర్ చోళ్ళేటి రమేష్, చీకోటీ ప్రదీప్, శ్రీనివాస్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారులకు గాలిపటాల పంపిణీ



కంటోన్మెంట్, జనవరి 16 ప్రభాతవార్తః సంక్రాంతి పడుగను పురస్కరించుకొని పల్లవి విద్యా సంస్థల పరిపాలన అధికారి మల్కా యశస్వి ఈస్ట్ మారేడ్‌పల్లి అంబేద్కర్‌నగర్‌లో బస్తీ నాయకులు చిన్న వీరయ్య, బాబు యాదవ్‌ల ఆధ్వర్యంలో పిల్లలకు గాలిపటాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యాక్రమంలో మోండా డివిజన్ కార్పొరేటర్ కొంతం దీపిక, బీజేపీ నేతలు శ్రీగణేష్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు హుండి లెక్కింపు

చిక్కడపల్లి, జనవరి 16 ప్రభాతవార్త: వివేక్‌నగర్ శ్రీ ఆంజనేయస్వామి దేవాలయం హుండి లెక్కింపు బుధవారం ఉదయం 9.30 గంటలకు ఆలయంలో జరుగుతుంది. ఆలయం ఈవో మాచర్ల దేవనాథం ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారుల పర్యవేక్షణలో లెక్కింపు జరుగుతుందని, ప్రతి ఒక్కరు పాల్గొనవచ్చని వివరించారు.

## ఎమ్మెల్యే గాంధీకి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపిన నేతలు



కెపిహెచ్‌బి కాలనీ, జనవరి 16, ప్రభాతవార్త : సంక్రాంతి పర్వదినం సందర్భంగా ఎమ్మెల్యే అరికెపూడి గాంధీకి నియోజకవర్గానికి చెందిన నాయకులు కార్యకర్తలు సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. ఎమ్మెల్యే గాంధీ నివాసంలో కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, చందానగర్ డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రఘునాథ్‌రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఆదర్శ్‌రెడ్డిలు మర్యాదపూర్వకంగా కలిసి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

## గ్రామ పంచాయతీ కార్మికుల డిమాండ్లను పరిష్కారించాలి



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎం.డి.యూసఫ్

సైఫాబాద్, జనవరి 16 ప్రభాతవార్త: గ్రామ పంచాయతీ కార్మికుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి నూతన ప్రభుత్వం చొరవ చూపాలని ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షుడు ఎం.డి.యూసఫ్ కోరారు. ఈ మేరకు మంగళవారం సత్యనారాయణరెడ్డి భవన్‌లో తెలంగాణ గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ రూపొందించిన నూతన సంవత్సరం క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా 12 వేల 769 గ్రామ పంచాయతీలలో 50 వేల మంది కార్మికులు పనిచేస్తున్నారని, వారి వారి సమస్యలు పరిష్కారించాలని గత ప్రభుత్వ హయంలో ఆనేక పోరాటాలు నిర్వహించినా పట్టించుకోలేదని ఆరోపించారు. నూతన కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికుల సమస్యలను పరిష్కారించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు టి.నరసింహారెడ్డి, జయచంద్ర, బి.వెంకట్, రాజాం, మల్లయ్య అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని యువకుని మృతదేహం లభ్యం

జీడిమెట్ల, జనవరి 16, ప్రభాతవార్త: రోడ్డు ప్రక్కన ఓ గుర్తు తెలియని యువకుడి మృతదేహం లభ్యమైన సంఘటన దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాలలోకి వెళితే కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధి బహదూర్‌పల్లి సమీపంలోని పాలకేంద్రం వద్ద రోడ్డు ప్రక్కన యువకుడి మృతదేహం ఉంది. స్థానికుల సమాచారంతో దుండిగల్ సీఐ సిహెచ్ శంకరయ్య సిబ్బందితో సంఘటన స్థలాన్ని పరిశీలించారు. సిఐ శంకరయ్య తెలిపిన వివరాల ప్రకారం యువకుడి వయస్సు సుమారు 25 సంవత్సరాలు ఉంటుందన్నారు. రోడ్డు ప్రక్కన నడుచుకుంటూ వెళ్తుంటే వాహనం ఢీకొని ఉండవచ్చన్నారు. తలకు, కాళ్ళకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. స్థానికులు తెలిపిన ప్రకారం స్థానికంగా ఉండే ఓ హోటల్‌లో టీ తాగి వెళ్ళినట్లు సమాచారం. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్ట్‌మార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు దుండిగల్ సీఐ సిహెచ్ శంకరయ్య తెలిపారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## దేవాలయాలపై ప్రభుత్వాలు పెత్తనం విరమించుకోవాలి



ఖత్రాలోని శ్రీవైష్ణవి దేవాలయం ఎదుట ప్రదర్శన చేస్తున్న కార్యకర్తలు

సైఫాబాద్, జనవరి 16 ప్రభాతవార్త: దేశ వ్యాప్తంగా ఉన్న హిందూ దేవాలయాలపై ఆయా రాష్ట్ర ప్రభుత్వాల పెత్తనం నిరోధించాలని డిమాండ్ చేస్తూ ఏకం సనాతన్ భారత్ దళ్ కార్యకర్తలు జమ్ములోని ఖత్రాలోగల మాతా శ్రీవైష్ణవిదేవి అమ్మవారి ఆలయం ఎదుట భారీగా ప్రదర్శన నిర్వహించారు. దళ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ప్రదర్శనలో దేశం నలుమూలల నుంచి వచ్చిన కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దళ్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరేంద్రకుమార్ చతుర్వేది మాట్లాడుతూ ఖత్రాలోని హిందూ దేవాలయా లు, పుణ్య క్షేత్రాలపై ప్రభుత్వం పెత్తనం చేయడం మానుకోవాలని డిమాండ్ చేశారు. మజీదులను ముస్లింలు, చర్చిలను క్రైస్తవులు, గురుద్వారాలను సిక్కులు నడిపిస్తున్నారని, కాని హిందూ దేవాలయాలపై ప్రభుత్వాల పెత్తనం ఎందుకని ఆయన ప్రశ్నించారు. హిందూ ధార్మిక ఆధ్మాతిక సంస్థలను ప్రభుత్వాలు కేవలం వాణిజ్య కేంద్రాల కే పరిమితం చేశాయని, భక్తుల డబ్బులతో ఇతరా కార్యక్రమాలకు ప్రభుత్వాలు వినియోగిస్తున్నాయని ఆరోపించారు. శ్రీవైష్ణవదేవి ఆలయాన్ని కొన్ని వందల సంవత్సరాలుగా పూజలు నిర్వహిస్తున్న వారికే ఆలయ నిర్వహణ బాధ్యతలను అప్పగించాలన్నారు. ఇతరులకు ప్రభుత్వం అప్పగించరాదని, ప్రభుత్వం తన పెత్తనాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. శ్రీవైష్ణవి దేవాలయం అభివృద్ధికి ప్రభుత్వం ఏలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో దళ్ జాతీయ అధ్యక్షుడు అంకుర్‌శర్మ, ప్రధాన కార్యదర్శి సందీప్ తదితరులు పాల్గొన్నారు.

## టిటిడి శ్రీవారి దేవాలయంలో ఘనంగా గోదాదేవి అమ్మవారి కల్యాణం




సైఫాబాద్, జనవరి 16 ప్రభాతవార్త: ధనుర్మాసంను పురస్కరించుకుని మంగళవారం ఉదయం లిబర్టి వద్దగల టిటిడి శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం (తిరు నియలం)లో గోదాదేవి అమ్మవారు-రంగనాయకుల స్వామి వారి కళ్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా కన్నుల పండువగా జరిగింది. ఉదయం 10 గంటలకు ముందే వేలాది మంది భక్తులు కళ్యాణ మహోత్సవానికి హాజరైనారు. వేద పండితుల మత్రోచ్చరణలు వల్లిస్తుండగా సన్నయి మేళాలు మ్రోగుతుండగా అమ్మవారి కళ్యాణం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి జంట నగరాల నుంచే కాకుండా పలు జిల్లాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. ఈ కళ్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకుని సిబ్బంది దేవాలయాన్ని పూల మాలలతో అందంగా అలంకరించారు. విద్యుత్ దీపాల ఏర్పాట్లుతో దేవాలయం మిరమిట్లు గోలిపే విద్యుత్ కాంతులతో ధగ, ధగ మెరిసిపోయింది. కళ్యాణం అనంతరం భక్తులకు సిబ్బంది రకరకాల ప్రసాదాల వితరణ గావించారు. ఈ కార్యక్రమంలో టిటిడి హైదరాబాద్ లోకల్ అడ్వయిజరి కమిటి అధ్యక్షుడు ప్రసాద్, టిటిడి డిప్యూటి ఎఈవొ రమేష్‌బాబు, సిబ్బంది భక్తులు సేవలు అందించారు.

**వైభవోపేతంగా గోదాఅమ్మవారి కరినోము ఉత్సవం**

**చిక్కడపల్లి..** చిక్కడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో ధనుర్మాస వైకుంఠ ఏకాదశి మహోత్సవాలలో భాగంగా మంగళవారం కనుమ పండుగ సందర్భంగా గోదాఅమ్మవారి కరినోము ఉత్సవం నేత్రపర్వంగా సాగింది. ఆలయం వ్యవస్థాపక వంశీయుడు జి.శ్రీనాథ్‌గౌడ్, ఈవో కె.రామాంజనేయులు ఆధ్వర్యంలో ఈ వేడుకను ఘనంగా నిర్వహించారు. కాగా సోమవారం మకర సంక్రమణ పర్వదినోత్సవం సందర్భంగా ఉత్తరాయ పుణ్యకాలం కార్యక్రమం కన్నులపండువగా సాగింది. ఆయా కార్యక్రమాలలో భక్తులు పెద్దసంఖ్యలో స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు.

## పెండింగు సమస్యలను పరిష్కరించాలి



రహ్మత్‌నగర్‌లో పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలంటూ కార్పోరేటర్ సిఎన్‌రెడ్డిని కలిసిన డివిజన్ మాజీ అధ్యక్షులు ఎక్బాల్

యూసుఫ్‌గూడ, జనవరి 16, ప్రభాతవార్త : జూబ్లీహిల్స్ నియోజకవర్గం పరిధిలోని రహ్మత్ నగర్ డివిజన్‌లో బస్తీల కాలనీలలో నెలకొన్న సమస్యలను దశలవారిగా పరిష్కరించేందుకు తగిన విధంగా కృషి చేయడం జరుగుతుందని డివిజన్ కార్పోరేటర్ సిఎన్‌రెడ్డి అన్నారు. ఈసందర్భంగా మంగళవారం డివిజన్ మాజీ అధ్యక్షులు ఎక్బాల్ ఆధ్వర్యంలో కార్పోరేటర్ సిఎన్‌రెడ్డిని కలిసి సమస్యలు వివరించారు. అనంతరం సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

## విద్యుత్ తీగలపై ఉన్న గాలి పటం తీయటానికి ప్రయత్నించిన బాలుడు మృతి



మృతి చెందిన బాలుడు దోర్నాల లక్ష్మీ వివేక్

మైలార్‌దేవ్‌పల్లి, జనవరి 16 ప్రభాతవార్త : విద్యుత్ తీగలపై ఉన్న గాలి పటాన్ని తీయటానికి ప్రయత్నించిన పదమూడేళ్ల బాలుడు ప్రమాదవ శాత్తు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌కు గురై సంఘటన స్థలంలోనే మృతి చెందిన సంఘటన మంగళవారం మైలార్ దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ రజాక్ కథనం ప్రకారం.. కాటేదన్ లోని గణేష్ నగర్‌కు చెందిన సంతోష్ కుమార్‌కు ఫోటో స్టూడియో ఉంది. సంతోష్ కుమార్ పెద్ద కొడుకైన దోర్నాల లక్ష్మీ వివేక్ (13) స్థానికంగా ఉన్న రవి బ్రిలియంట్ పాఠశాలలో ఐదవ తరగతి చదువుచున్నాడు. మంగళవారం సాయంత్రం లక్ష్మీ వివేక్ భవనం మీదకు ఎక్కాడు. విద్యుత్ వైర్లకు ఉన్న గాలి పటాన్ని ఇనుప రాడ్‌తో తీయటానికి ప్రయత్నించాడు. ప్రమాదవ శాత్తు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావటంతో వివేక్ తీవ్ర గాయాల పాలయ్యాడు. కుటుంబ సభ్యులు గాయాల పాలైన లక్ష్మీ వివేక్‌ను చికిత్స కోసం ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. సమాచారం అందుకున్న మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు వివేక్ మృత దేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురికి తరలించారు. ఈ కేసును మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. గగన్ పహాడ్ ఎడిఇ ఈశ్వర్ ప్రసాద్ సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఈ నెల 12వ తేదీ శు క్రవారం సాయంత్రం కిషన్‌బాగ్ రహదారిలోని మల్లయ్య టవర్స్ ఎదురుగా ఉన్న లక్ష్మీ వాణి టవర్స్ ప్రాం తానికి చెందిన తనిష్క్ (11) అనే బాలుడు గాలి పటం ఎగురు వేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అవ ్వటంతో అక్కడకక్కడే మృతి చెందాడు. ఈ కేసును అత్తాపూర్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

### వివిధ రంగాల్లో నిష్ణాతులకు

## జాతీయ సేవారత్న, నంది అవార్డులు

రవీంద్రభారతి, జనవరి 16 ప్రభాతవార్త : వివిధరంగాల్లో, సంస్థల్లో పనిచేస్తున్న, ప్రాముఖ్యత కలిగిన నిష్ణాతులకు అభిలాష హెల్పింగ్ హ్యాండ్స్ అర్గనైజేషన్ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 27 శనివారం రవీంద్రభారతి ప్రధాన మందిరంలో వైభవోపేతంగా జరుపనున్న కార్యక్రమంలో నంది, జాతీయ సేవారత్న అవార్డులను ప్రదానం చేయనున్నట్లు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు డా. ఎస్.సరోజనమ్మ మీడియాకు తెలిపారు. అవార్డులు అందుకునే వారిలో ప్రముఖంగా కవులు, కళాకారులు, సంఘసంస్కర్తలు, సినీ, టీవి కళాకారులు, దర్శకులు, నిర్మాతలు, స్టేజి ఆర్టిస్టులు, గాయనీగాయకులు, సంగీత నృత్య కళాకారులు, డాక్టర్లు, న్యాయవాద, ఫ్యాషన్ డిజైనర్లు, ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియాకు ప్రముఖులున్నారని, ఈ కార్యక్రమానికి విచ్చేయనున్న ప్రముఖులైన అతిథుల చేతులమీదుగా ఆయా అవార్డులను, ఆయా రంగాల నిష్ణాతులను ఘనంగా సత్కరించి ప్రదానం చేయడం జరుగుతుందని సరోజనమ్మ వివరించారు.

## నేడు పాతబస్తీలో విద్యుత్ ఉండని ప్రాంతాలు

చార్మినార్,జనవరి 16 ప్రభాతవార్త : విద్యుత్ మరమ్మతులు కారణంగా ఈ నెల 17వ తేదీ బుధవారం ఉదయం 10 నుంచి 12 గంటలు వరకు జూపార్కు క్వార్టర్స్, చిరాగ్ అలీ నగర్, బహదూర్‌పుర, 12 నుంచి 2 గంటలు వరకు పురానాపూల్, బహదూర్‌పుర, బహదూర్‌పుర కాలనీ, మెట్రో థియుటర్, 3 నుంచి 5 వరకు జూపార్కు, జూ క్వార్టర్స్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు చార్మినార్ ఎడిఇ మహ్మద్ అఫ్జల్ తెలిపారు. 10 నుంచి 12 గంటలు వరకు షష్మా, వట్టెపల్లి, పరాదా గేట్, మిస్కిన్ హోటల్, అల్‌మదీనా, హోటల్ బస్తీలలో, 12 నుంచి 2 వరకు ఫలక్‌నుమా, మదీనా కాలనీ, రైతు బజార్, బస్ డిపో, ఇంజన్ బౌలి, జహానుమా, చార్‌చమన్, 3 నుంచి 7 గంటలు వరకు వట్టెపల్లి, ముస్తాఫానగర్, నైస్‌ల్, గుంతల్‌షా దర్గా, మహమ్మదీయ కాలనీ ప్రాంతాలలో విద్యుత్ సరఫర ఉండదని ఫలక్‌నుమా సిబిడి ఎడిఇ మధుసూధన్‌రెడ్డి తెలిపారు.

## వైభవంగా సంక్రాంతి వేడుకలు



సంక్రాంతి వేడుకల్లో పాల్గొన్న తెలంగాణ బెంగాలీ సమితి ప్రతినిధులు

చార్మినార్, జనవరి 16 ప్రభాతవార్త : పాతబస్తీలోని పలు ప్రాంతాలలో సం క్రాంతి వేడుకలు వైభవంగా జరిగాయి. సంక్రాంతి సందర్భంగా ప్రజలు తమ ఇండ్లను అందంగా అలంకరించారు. ప్రజలు పూజలు నిర్వహించి ఎంతో ప్రీతితో పిండి వంటకాలను ఆరగించారు. కొత్త బట్టలు ధరించి పండుగ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. కాగా తెలంగాణ బెంగాలీ సమితి అధ్యక్షులు దీపాంకర్ పాల్ ఆధ్వర్యంలో ఘాన్సీ బజార్‌లో ఘనంగా పతంగుల వేడుకలు జరిగాయి. సమితి ప్రతినిధులు, బెంగాలీలు ఎంతో ఉత్సాహంతో గాలి పటాలు ఎగురు వేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బెంగాలీ సమితి ప్రతినిధులు దీపాంకర్ పాల్, మందిరా నస్కర్, బబ్లూ, నబీన్, దేబ్‌జీత్, సుమతో పాటు పలువురు పాల్గొన్నారు.

## బిఎస్‌పి పార్టీ పటిష్టత కోసం కృషి చేయాలి



కార్యక్రమంలో పాల్గొన్న బిఎస్‌పి హైదరాబాద్ జిల్లా అధ్యక్షురాలు చాట్ల చిరంజీవి,కోశాధికారి మూల రామ్ చరణ్ దాస్,నాయకులు

చార్మినార్, జనవరి 16 ప్రభాతవార్త : హైదరాబాద్ జిల్లా బిఎస్‌పి కోశాధికారి, చాంద్రాయణగుట్ట కాంటెస్టెడ్ ఎమ్మెల్యే మూల రామ్ చరణ్ దాస్ ఓ కార్యక్రమంలో పాల్గొన్నారు. పాతబస్తీ లలితాబాగ్ రోడ్‌లో పాతనగర బహుజన సమాజ్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. జిల్లా బిఎస్‌పి అధ్యక్షులు చాట్లా చిరంజీవి మాట్లాడుతూ పాతబస్తీలో బిఎస్‌పి పార్టీని బలోపేతం చేయటానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో బంగారి మాణిక్ రావు, తోటకడి రమేష్, మనిబాబు, జగదీష్ పాల్గొన్నారు.

## శ్రీరాముని అక్షింతల పంపిణీ

శామీర్‌పేట, జనవరి 16, ప్రభాతవార్త : అయోధ్యలోని శ్రీరామమందిరంలో ఈ నెల 22వ తేదీన శ్రీరాముని పున:ప్రాణ ప్రతిష్ట కార్యక్రమం జరుగుతున్నందున దేశవ్యాప్తంగ శ్రీరాముని అక్షింతల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నందున ఇందులో భాగంగ శామీర్‌పేటలో గత వారం రోజుల నుంచి ఇంటింటా అక్షింతల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

# పండుగ వేళ.. పారిశుద్ధ్య కార్మికుల గోస

**కార్మికుల కష్టానికి.. నిజాంపేట్ స్వచ్ఛ సర్వేక్షణ్**

**జీతాల కోసం ఎదురుచూపులు**

**పండుగ బోనస్ కూడా నోచుకోని కష్టజీవులు**

**నెలాఖరు వరకు అందని జీతాలు ?**

**పేరుకు గొప్ప.. ఆచరణకు నిజాంపేట్ కార్పోరేషన్ దిబ్బ**

**అధికారులూ వీరిపై మీ అంధకారం వీడరూ**




నిజాంపేట్, జనవరి 16, ప్రభాతవార్త : వారు కష్టపడి చెమటోడ్చి పని చేస్తే కానీ.. ఆరుబయట ప్రశాంతమైన వాతావరణం అందుతుంది. వారి ప్రాణాలను అడ్డు పెట్టుకుని ప్రజల ఆరోగ్యాలకు రక్షణ కల్పిస్తుంటారు. వారు చేసే వృత్తిని ఏమాత్రం ఆదమరిచి అలు వైపుకు వెళ్ళకుండా ఉంటే ఇక అంతే ఆ ప్రాంతంలోని దుర్గంధమయమైన వాతావరణంతో పాటు ప్రజలకు అనేక ఆటంకాలకు గురి చేస్తుంది. అలాంటి వృత్తిని నమ్ముకొని కష్టపడి పని చేస్తున్న మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుల పట్ల నిజాంపేట్ మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. వారి కష్టానికి ఫలితంగా నిజాంపేట్ మున్సిపల్ కార్పోరేషన్‌కు రెండుమార్లు స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులు అందుకుంది. ఢిల్లీకి వెళ్ళి ఆతృతతో అవార్డులు అందుకుంటున్న అధికారులు, ప్రజా ప్రతినిధుల గౌరవానికి ఫలితం ఇక్కడ పని చేసే కార్మికుల ఫలితమే అని చెప్పవచ్చు. ప్రతి ఇంట్లో సంక్రాంతి పండుగను కుటుంబ సమేతంగా సంతోషంగా ఆర్భాటకంగా వేడుకలు జరుపుకుంటున్న సందర్భంలో వారి ఇండ్లలో మాత్రం ఎలాంటి ఆర్భాటాలు లేకుండా.. రోజుమాదిరిగానే గడిపారు. ఫలితంగా ఇక్కడి అధికారుల నిర్లక్ష్యంగా వారికి రావాల్సిన జీతాలు సకాలంలో అందకపోవడమే కారణం. కార్పోరేషన్‌లోని పని చేస్తున్న కార్మికులకు నెలనెల మొదటివారంలో వారు చేసే కష్టానికి ఫలితంగా జీతాలు చెల్లిస్తే ఆ కుటుంబాల్లో నాలుగు వ్రేళ్ళు లోపలికి వెళ్తాయి. కానీ అలాంటి వాటికి తావున్వికుండా వారు చేసే కష్టాన్ని గుర్తించకుండా ఉన్న అధికారుల నిర్లక్ష్యం కారణంగా వారు కుటుంబాలు అర్థాకలితో అలమటిస్తున్నారు.

**విడతల వారిగా చెల్లింపులు.. పండుగ బోనస్ మిస్..**

కార్పోరేషన్‌లో పని చేస్తున్న పారిశుద్ధ్య, ఇతర విభాగాల్లో పని చేసే కార్మికులకు అందరికి ఏక కాలంలో జీతాలు చెల్లించకుండా విడతల వారిగా చెల్లింపులు చేస్తున్నట్లు తెలుస్తుంది. దీని కారణంగా కొంతమంది కుటుంబాల్లో నెలతర్వాత వచ్చే జీతాల కోసం ఎదురుచూపులు చూడక తప్పడంలేదు. సంక్రాంతి పండుగ అతి పెద్దది కావడంతో సంతోషంగా కుటుంబంతో గడిపే కార్మికులకు నిరాశే మిగిల్చింది. కనీసం వారికి పండుగ సమయంలో ఇచ్చే బోనస్ కోసమైనా వస్తుందని ఆశతో ఎదురుచూసిన కార్మికులకు అది కూడా నిరాశను నింపింది. ఆర్భాటకంగా నిజాంపేట్ మున్సిపల్ కార్పోరేషన్ కోసం గొప్పలు చెప్పుకుంటున్న అధికారులు, ప్రజా ప్రతినిధుల మాటలు వెనుక కార్మికుల కష్టం ఉందని గుర్తించకపోవడం వారి నిర్లక్ష్యానికి నిదర్శనంగా మారింది. ఇప్పటికైనా కార్పోరేషన్ కమీషనర్, మేయర్ స్పందించి సకాలంలో ప్రతి నెల మొదటి వారంలోనే కార్మికులకులందరికీ ఇచ్చే జీతాలను సకాలంలో చెల్లించడంతో పాటు పండుగ సమయంలో చెల్లించే బోనస్‌లను సైతం పెండింగ్‌లో లేకుండా అందరికి వర్తించేలా తగు చర్యలు తీసుకోవాలని కార్మికులు కోరుకుంటున్నారు.

## కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవాలయంలో ముఖ్యమంత్రి సతీమణి పూజలు



పూజలు నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సతీమణి గీతారెడ్డి

సైదాబాద్, జనవరి 16 ప్రభాతవార్త: చారిత్రక నేపథ్యం కలిగి అత్యంత మహిమాన్విత దేవాలయంగా భక్తులు విశ్వసించే కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సతీమణి గీతారెడ్డి తమ కుటుంబ సభ్యులతో కలిసి మంగళవారం సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయ అర్చకులు ఆశీర్వచనం చేసి తీర్థప్రసాదాలు అందించారు. పూజల అనంతరం స్వామి వారి పల్లకి సేవలో పాల్గొన్నారు. అంతకు ముందు దేవాలయ పాలక మండలి చైర్మన్ నల్ల రఘుమారెడ్డి, కార్యనిర్వాహణాధికారి శ్రీనివాస శర్మలు ముఖ్యమంత్రి సతీమణికి స్వాగతం పలికారు. ముఖ్యమంత్రి సోదరుడు కొండల్ రెడ్డి కూడా స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మంచిరేవులలో వాచ్‌మెన్ దారుణ హత్య

### నార్సింగి పోలీసు స్టేషన్ పరిధిలో ఘటన

నార్సింగి, జనవరి 16 ప్రభాతవార్త : వాచ్‌మెన్ దారుణ హత్యకు గురైన విషాదకర సంఘటన నార్సింగి పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్గొండ జిల్లా కందుకూరు డిండీ ప్రాంతానికి చెందిన జంగయ్య నార్సింగి మున్సిపల్ పరిధి మంచిరేవుల గ్రామంలోని ఓ భవనం వద్ద జంగయ్య వాచ్‌మెన్‌గా పని చేస్తున్నాడు. ఈ భవనం వద్ద ఉన్న ఐరన్ స్క్రాబ్‌ను అక్కడే పని చేస్తున్న తాపీమేస్త్రీ అర్జున్ ఓనర్‌కు తెలియకుండా తరుచూ అమ్ముకుంటున్నాడు. ఈ విషయంను పసిగట్టిన వాచ్‌మెన్ జంగయ్య ఓనర్‌కు అర్జున్ చేస్తున్న దొంగతనం విషయంను తెలిపారు. ఓనర్... మేస్త్రీ అర్జున్‌కు ఫోన్‌చేసి మరోమారు దొంగతనం చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. నా దొంగతనం విషయంను ఓనర్‌కు వాచ్‌మెన్ జంగయ్యనే చెప్పాడని, అతడిపై పగ తీర్చుకోవాలని కక్ష పెంచుకున్నాడు. సంక్రాంతి పర్వదినం(15.జనవరి) రోజు మద్యం సేవించిన అర్జున్ వాచ్‌మెన్ దగ్గరకు వెళ్లి గొడవ పడ్డాడు. పదునైన ఐరన్ రాడ్‌తో దాడి చేయడంతో తీవ్ర రక్తస్రావమై వాచ్‌మెన్ అక్కడే మృతి చెందాడు. స్థానికులు 100.కు ఫోన్‌చేసి సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహంను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. హత్య చేసిన మేస్త్రీ అర్జున్ పరారీలో ఉన్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### నేడు అయోధ్య శ్రీరామ మందిరానికి

## కంటోన్మెంట్ 1265 కేజీల భారీ లడ్డూ తరలింపు

కంటోన్మెంట్, జనవరి 16 ప్రభాతవార్త : మారేడ్‌పల్లి పికెట్‌కు చెందిన శ్రీరామ క్యాటరింగ్ సర్వీసెస్ అధినేత నాగభూషణంరెడ్డి ఆధ్వర్యంలో అయోధ్య రామమందిరానికి 1265 కేజీల లడ్డూ ప్రసాదాన్ని తరలించనున్నారు. శ్రీరామజన్మభూమి ట్రస్ట్ ఆయోధ్యకు సమర్పించేందుకు ఈ లడ్డూను సిద్ధం చేశారు. ఈనెల 17న ఈ భారీ లడ్డూను తీసుకువెళ్లేందుకు ఏర్పాట్లు జరిపారు. ఈస్ట్ మారేడ్‌పల్లి బాలాంజనేయస్వామి దేవాలయంలో లడ్డూను తయారు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. 17న ఉదయం ఆరు గంటలకు పికెట్ మారేడ్‌పల్లిలోని తన నివాసం నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు శ్రీరామచంద్రుని భక్తులు దర్శించుకోడానికి వీలుగా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. అనంతరం లడ్డూనూ తాడుబంద్ హనుమాన్ ఆలయం వరకు ఊరేగింపుతో శోభయాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శోభయాత్ర కార్యాక్రమాన్ని కేంద్రమంత్రి జి. కిషన్‌రెడ్డి ప్రారంభిస్తారని తెలిపారు. అనంతరం వాహనంలో ఏసీ గ్లాస్‌లో ప్రత్యేకంగా భారీ లడ్డూను తరలించేన ఏర్పాట్లు జరిపినట్లు వివరించారు. హైదరాబాద్ నుంచి అయోధ్య పుణ్యక్షేత్రం వరకు శోభయాత్రగా తీసుకువెళుతున్నట్లు చెప్పారు. ట్రస్ట్ అధ్యక్షుడు సంపత్ రాయిజి అనుమతితో నైవేద్యం కోసం లడ్డూను తయారుకు చేయడంతో పాటు అయోధ్యలో ఈనెల 22న జరిగే సీతారాముల వారి ప్రతిష్ఠ రఓజుకు రెండు కిలోల చొప్పున మరో ఐదు లడ్డూలను తయారు చేసి తీసుకువెళుతున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యాక్రమంలో బీఎన్ శ్రీనివాస్, సీతేష్‌కుమార్, రాజ్‌మల్లేష్, విజయానంద్, కృష్ణకుమారి, సామ మహేందర్‌రెడ్డి, అజయ్‌రెడ్డి, చందన్‌రెడ్డి, గౌతమి చందన తదితరులు పాల్గొన్నారు.

# గండిపేట్ మండలంలో అంబరాన్ని అంటిన సంక్రాంతి సంబురాలు

**ముగ్గుల పోటీలు,**
**పతంగుల ఎగురవేతలలో మునిగిన యువత**

నార్సింగి, జనవరి 16 ప్రభాతవార్త : హిందువులు జరుపుకునే పెద్ద పండుగల్లో ఒకటైన సంక్రాంతి పర్వదినం సంబరాలు గండిపేట్ మండలంలో అంబరాన్ని అంటాయి. మండలంలోని నార్సింగి, హైదర్షాకోట్, కోకాపేట్, మణికొండ, పుప్పాలగూడ, గండిపేట్, ఖానాపూర్, వట్టినాగులపల్లి, మంచిరేవుల, పీరంచెరువు, బండ్లగూడ, కిస్మత్‌పూర్ గ్రామాలలో మూడు రోజుల పాటు జరిగిన ఈ సంక్రాంతి పర్వదినాలలో చిన్నా,పెద్దా ఆడ,మగ తేడా లేకుండా అందరూ సంబరాల్లో మునిగి తేలారు. గత వారం రోజుల నుంచే విద్యార్థులు పతంగులను ఎగుర వేయడంలో పోటీలు పడ్డారు. పర్వదినం సందర్భంగా పలు స్వచ్చంద సంస్థలు, కుల సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీలలో యువతులు, మగువలు అధికంగా పాల్గొన్ని తమ ప్రతిభను చాటుకున్నారు. భోగి పండగ రోజు ఇంటిల్లిపాది అందరూ భోగి మంటలు కాపుకొని, నువ్వుల రొట్టెలు చేసుకొని భుజించారు. సంక్రాంతి రోజు ఏ ఇంటి ముందు చూసినా హారివిల్లు వలే విరబూసిన రంగు రంగుల ముగ్గులే దర్శనమిచ్చాయి. పర్వదినం తెల్లవారు జాముననే మహిళలు



హిమాయత్ సాగర్‌లోని సాడమ్మ ఆలయం వద్ద గాలిపటాలు ఎగురవేస్తున్న ప్రజలు

లేచి తలంటు స్నానాలు చేశారు. సూర్యోదయానికి ముందే వాకిళ్లలో ఆవు పేడతో కల్లాలు చల్లి, రంగు రంగుల ముగ్గులు వేసి వాటిలో గొబ్బెమ్మలను ఉంచారు. అనంతరం తమ కొత్త బట్టలు ధరించి ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ఆరు గంటల నుంచే ఆలయాలు భక్తుల సందడితో కిటకిటలాడాయి. భక్తుల రద్దీకి అనుగుణంగా నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. అనంతరం పిండి వంటలైన భక్షాలు, అరిసెలు, బూరెలు, గారెలు వంటి వంటలు చేసుకొని ఇంటిల్లిపాది అంతా కలిసి భోజనం చేశారు. సంక్రాంతి మరుసటి రోజు పెద్ద ఎత్తున మేకలు, గొర్రెలు, కోళ్ల వధించి మద్యం సేవించి తమ ఆనందాన్ని వ్యక్తం చేసుకున్నారు. మొత్తంమీద ఎటు చూసినా సంక్రాంతి పర్వదినం సంబరాల్లో ప్రజలు మునిగి తేలడం కనిపించింది. పట్టణాలలోని ప్రజలంతా పెద్ద ఎత్తున తమ గ్రామాలకు తిరిగి వెళ్లడంతో మెహిదీపట్నం, లంగర్‌హౌస్, టోలిచౌకిలో, సన్‌సిటీ, బండ్లగూడ, నార్సింగి, మణికొండ ప్రాంతాలలోని ప్రధాన రోడ్లు బోసి పోయి కనిపించాయి. గండిపేట్‌లోని అమ్మ వారి ఆలయం వద్ద కన్నుల పండువగా బోనాల ఉత్సవాలు జరిగాయి. చుట్టు పక్కల ఉన్న గ్రామాల ప్రజలు సైతం పెద్ద ఎత్తున వెళ్లి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. గంధంగూలో ఉన్న శ్రీశ్రీశ్రీ జ్ఞానవేంకటేశ్వర స్వామి ఆలయం ఆవరణలో సంక్రాంతి సందర్భంగా కుటుంబాలతో కలిసి పతంగుల పండగను ఘనంగా నిర్వహించుకున్నారు. బిజెపి సీనియర్ నేత మల్లారెడ్డి తదితరులు ఈ వేడుకల్లో పాల్గొని ప్రజలను పోత్సహించారు.

# ఇప్పటికి.. కాంగ్రెస్ ప్రభుత్వం కేటాయించిన ఇందిరమ్మ ఇంటిలోనే ఉంటున్నా

**ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు**

చిక్కడపల్లి, జనవరి 16 ప్రభాతవార్త: పేపర్ బాయ్ నుంచి ఖానాపూర్ ఎమ్మెల్యేగా గెలిచానని, ఈ స్థానంకు రావడానికి కారణం పేపర్‌భాయ్ వృత్తే కారణమని స్థానిక ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. తాను నేటికి తనకు కాంగ్రెస్ ప్రభుత్వం కేటాయించిన ఇందిరమ్మ ఇంటిలోనే ఉంటున్నానని, అదే కాంగ్రెస్ పార్టీ నుంచి నేడు టికెట్ సాధించి ఆ స్థానం నుంచి ఎమ్మెల్యేగా గెలిచానని స్థానిక ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. మంగళవారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో తెలంగాణ మీడియా డిస్ట్రిబ్యూటర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రథమ మహాసభ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వనమాల సత్యం అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మహాసభను ప్రారంభించిన అనంతరం ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు మాట్లాడారు. కేవలం రూ.200కు పేపర్‌భాయ్‌గా పనిచేశానని, ఎమ్మెల్యే కావడానికి ఈ వృత్తిద్వారానే సాధ్యమైందన్నారు. ఒక సామాన్యుడిని సైతం ఎమ్మెల్యేగా చేసిన ఘనత కేవలం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమైందని అన్నారు. తెలంగాణ పేపర్ డిస్ట్రిబ్యూటర్స్ అసోసియేషన్ వెల్లడించిన సమస్యలను సిఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేయడంతో పాటు అవసరమైతే అసోసియేషన్ సభ్యులతో కలిసి వెళ్తామన్నారు. తాను ఎమ్మెల్యేగా ఎదగడానికి కారణం పేపర్‌బాయ్ వృత్తి కారణమని, ఈవృత్తిని చిన్నచూపు చూడవద్దని, ఆ వృత్తిలో పనిచేసిన అబ్దుల్ కలామ్ భారత రాష్ట్రపతిగా ఎదిగారని, ఛాయ్ అమ్మిని వ్యక్తి భారత ప్రధానమంత్రి



ప్రసంగిస్తున్న ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

అయ్యారని, ఎస్ఎస్‌సి ఫెయిల్ అయిన సచిన్ టెండుల్కర్ భారత క్రికెట్‌రంగంలో దిగ్గజ ఆటగాడిగా చరిత్ర సృష్టించారని గుర్తు చేశారు. 2007 నుంచి 2008 వరకు అదిలాబాద్ జిల్లా ఉట్నూరులో పేపర్ వేయడం జరిగిందని, ఆ సమయంలో సైకిల్ లేకపోవడంతో బర్రెలు అమ్మి సైకిల్ ఖరీదు చేసి పేపర్ వేశానని అన్నారు. ప్రతి తాను పేపర్ వేసే సమయంలో ఎన్నో ఇబ్బందులు పడ్డానని, వారి సమస్యలు తనకు తెలుసునని అన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జాతీయ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సునీల్ పాఠంకర్, కె.సత్తార్, కర్ణాటక రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వాసుదేవ్, తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రాంప్రసాద్‌రావు, ఉపాధ్యక్షులు శ్రీశైలం, రాజు, సతీష్, ప్రభాకర్, కార్యనిర్వాహక కార్యదర్శి రణం రవీందర్‌గౌడ్, కోశాధికారి రాజేందర్, మీడియా ఇంచార్జ్ లక్ష్మినారాయణ, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు. దినపత్రికరంగంలో పనిచేస్తున్న వారికి 80శాతం సబ్సిడీతో ఈ-చార్జింగ్ మోటారు సైకిళ్ళను మంజూరు చేయాలని, పత్రికల లోడింగ్ పంపిణీ కోసం రైతుబజార్‌ల మాదిరిగా షెడ్స్ ఏర్పాటు చేయాలని, రూ.20లక్షల ఆరోగ్యబీమా, రూ.50లక్షల ప్రమాదబీమా సౌకర్యం కల్పించాలని, కార్మిక శాఖ నుంచి గుర్తింపుకార్డులివ్వాలని, సంక్షేమబోర్డును ప్రభుత్వం అనుబంధంగా ఏర్పాటు చేయాలని, రూ.20లక్షల సంక్షేమ నిధిని ఏర్పాటు చేయాలని, ఈ రంగంలో పనిచేస్తున్న వారి కుటుంబాల పిల్లలకు ఉపకార వేతనాలు, ఉన్నత విద్య కోసం సహాయం అందించాలని, ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఆరోగ్య శిబిరాలు నిర్వహించి వైద్యపరీక్షలు, మందులు ఉచితంగా అందించాలని కోరారు. స్ట్రీట్‌వెండర్ స్కీం ద్వారా వడ్డీలేని రుణాలు రూ.50వేల నుంచి రూ.10లక్షల వరకు ఎలాంటి షరతులు లేకుండా రుణాలివ్వాలని, డబుల్ బెడ్ రూమ్ ఇళ్ళను కేటాయించాలని, డిస్ట్రిబ్యూషన్ కోఆపరేటివ్ సొసైటీలు ప్రతి జిల్లాల్లో ఏర్పాటు చేసి రుణాలు మంజూరు చేయాలని, డిస్ట్రిబ్యూటర్‌లకు కూడా ప్రెస్‌క్లబ్స్‌లలో సభ్యత్వం ఇవ్వడంతో పాటు అక్రిడేషన్ కార్డులను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ రూపొందదించిన డైరీని, క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.

## సర్కిల్ ఇన్స్‌పెక్టర్‌కు సన్మానం



నూతన ఎస్ఐ ఉపేందర్‌ను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలుపుతున్న శ్రీనివాస్‌రెడ్డి

నిజాంపేట్, జనవరి 16, ప్రభాతవార్త : నూతనంగా బాచుపల్లి పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్‌గా నియమితులైన ఉపేందర్‌ను మంగళవారం రాష్ట్ర సీనియర్ నాయకులు కొలను శ్రీనివాస్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి సర్కిల్ ఇన్స్‌పెక్టర్ నియమితులైన సందర్భంగా శాలువాతో తస్కరించి, బొకె అందజేసి అభినందనలు తెలియజేశారు. అలాగే సంక్రాంతి పర్వదినాన్ని పురష్కరించుకుని సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జూలకంటి లక్ష్మారెడ్డి, మధుసుధన్‌రెడ్డి, విజయ్, గంగాధర్, ప్రసాద్, సత్తిరెడ్డి, ప్రేమ్ కుమార్, మహిపాల్, రఘు, మహేష్, కెఎస్ఆర్ టీమ్ సభ్యులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ ఖరారుపై సాయిచరణ్‌రెడ్డి హర్షం

ఘట్‌కేసర్, జనవరి 16, ప్రభాతవార్త: రాష్ట్ర ఎన్ఎస్‌యుఐ అధ్యక్షులు బల్మూరి వెంకట్‌కు ఎమ్మెల్సీ స్థానం ఖరారు చేయడం పట్ల మేడ్చల్ నియోజకవర్గ ఎన్ఎస్‌యుఐ అధ్యక్షులు చందుపట్ల సాయిచరణ్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఘట్‌కేసర్‌లో మంగళవారం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్‌పార్టీ పటిష్టతకు, విద్యారంగ సమస్యల పరిష్కారానికి బల్మూరి వెంకట్ అందిస్తున్న సేవలను గుర్తించి పార్టీ అధిష్ఠానం ఆయనకు ఎమ్మెల్యే కోటాలో శాసనమండలి సభ్యునిగా ఎన్నిక చేసేందుకు నిర్ణయించిందని పేర్కొన్నారు. కాంగ్రెస్‌పార్టీ కోసం కష్టపడి పనిచేసే అన్ని వర్గాల నాయకులకు తప్పక గుర్తింపు లభిస్తుందని, సీఎం రేవంత్‌రెడ్డి ఆయన సముచిత స్థానం కల్పించి ఎమ్మెల్సీగా ఖరారు చేయడం హర్షదాయకమన్నారు.

## ఆనందోత్సవాలతో పండుగ వేడుకలు

ఘట్‌కేసర్, జనవరి 16, ప్రభాతవార్త: ఘట్‌కేసర్ మండలంలో సంక్రాంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ప్రజలు మూడు రోజుల పాటు పండుగను ఎంతో ఘనంగా జరుపుకున్నారు. ప్రతి ఇంటిలో సంక్రాంతి సంబురాలను సాంప్రదాయబద్దంగా నిర్వహించారు. బోగి, సంక్రాంతి, కనుమ పండుగలను ఉత్సాహంగా జరుపుకున్నారు. మూడు రోజులు పాటు వాకిళ్లలో రకరకాల అందమైన ముగ్గులు, గొబ్బెమ్మలు దర్శనమిచ్చాయి. మహిళలు వాకిళ్లను ఆవుపేడతో అలికి ముగ్గులు వేసి గొబ్బెమ్మలు, రేగు పళ్ళు, నవధాన్యాలు పోశారు. ఆకాశంలో గాలిపటాల సందడి నెలకొంది. చిన్నా పెద్దా పంతగులు ఎగురవేస్తూ సందడి చేశారు. గ్రామాల్లో హరిదాసులు, గంగిరెద్దులు కనిపించలేదు. ఇళ్లలో రకరకాల పిండివంటలు, సాంప్రదాయ ఆహారాలు తయారు చేసుకున్నారు. పండుగకు బంధు మిత్రులను ఆహ్వానించుకొని వేడుకగా జరుపుకొని ఆనందాన్ని పంచుకున్నారు. ఘట్‌కేసర్, కొండాపూర్, చౌదరిగూడ, ఎన్ఎఫ్‌సీ నగర్, శివారెడ్డిగూడ, ఘణాపూర్, ఎదులాబాద్, వెంకటాపూర్, వెంకటాద్రిటౌన్‌షిప్, మక్తా, జోడిమెట్ల, మర్రిపల్లిగూడ, బొక్కోనిగూడ తదితర గ్రామాలు, కాలనీల్లో సంక్రాంతి వేడుకలు మిన్నంటాయి. బోగి పండుగ రోజు ప్రజలు దేవాలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. పండుగ సందర్భంగా రైళ్లు, బస్సులు, ప్రైవేటు వాహనాలలో ప్రయాణికుల రద్దీ అధికంగా నెలకొంది. గాలిపటాలు, రంగులు, మద్యం, మాంసం, చికెన్ విక్రయాలు జోరుగా జరిగాయి. మండలం నుంచి పెద్దసంఖ్యలో భక్తులు ఐనవోలు, కొమురవెల్లి మల్లన్న దర్శనాలకు తరలివెళ్లారు. కొందరు కోడిపందేలలో పాల్గొనడానికి ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా, ఉభయగోదావరి జిల్లాలకు వెళ్లారు. సూర్యుడు మకరరాశిలోకి ప్రవేశించిగా ఉత్తరాయణ పుణ్యకాలం ప్రారంభం కావడంతో పలువురు శుభకార్యాలు నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు. ఎంపిపి ఏనుగు సుదర్శన్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్యయాదవ్, వైఎస్‌చైర్మన్ పలుగుల మాధవరెడ్డి, ఆర్‌బిఎస్ సమన్వయకర్త కొంతం అంజిరెడ్డి, సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, కౌన్సిలర్లు ప్రజలకు సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ప్రజాప్రతినిధులు ప్రధాన కూడళ్లలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. మైబైల్ పోన్ కల్గిన ప్రతిఒక్కరూ సోషల్ మీడియా వేదికగా పండుగ సందర్భంగా మూడురోజుల పాటు శుభాకాంక్షలతో హోరెత్తించారు.

## అనంతారం గ్రామానికి మిషన్‌భగీరథ

### నీరు పంపిణీ లేక ప్రజల ఇబ్బందులు

శామీర్‌పేట, జనవరి 16, ప్రభాతవార్త : అనంతారం గ్రామానికి మిషన్‌భగీరథ నీరు సరఫరా లేక అనంతారం గ్రామ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మూడుచింతలపల్లి మండలంలోని అనంతారం గ్రామానికి గత నెల రోజుల నుంచి మిషనర్‌భగీరథ నీరు రావటం లేదని సంబంధిత అధికారులకు తెల్పినా స్పందన లేదని అనంతారం గ్రామ సర్పంచు ఎం.నర్సింహ్మారెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామానికి మిషన్‌భగీరథ నీరు సరఫరా కావటం లేదని గ్రామ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని మిషన్‌భగీరథ అధికారుల దృష్టికి తీసుకవెళ్లినా పట్టించుకోవటం లేదని గ్రామంలోని బోర్ల మీద ఆధారపడాల్సి వస్తుందని అనంతారంలో నీటి ఎద్దడి ఏర్పడిందని, మిషన్‌భగీరథ త్రాగునీరు సరఫరా కాక ప్రజలు బోరుబావులను ఆశ్రయించాల్సి వస్తుందని, బోర్ల నుంచి ట్యాంకులు నింపాలన్నా ఇబ్బందులు పడాల్సి వస్తుందని గ్రామ సర్పంచు ఎం.నర్సింహ్మారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా మండల, జిల్లా సంబంధిత మిషన్‌భగీరథ అధికారులు స్పందించి అనంతారంలో నీటి ఎద్దడిని తీర్చాలని, గ్రామానికి మిషన్‌భగీరథ నీటిని సరఫరా చేయాలని పైప్‌లైన్ ద్వారా వెళ్తున్నా గ్రామానికి వదలటం లేదని ఆయన అన్నారు. గ్రామంలో వివిధ వార్డుల ప్రజలు నీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నారని ఇకనైనా మిషన్‌భగీరథ అధికారులు స్పందించి గ్రామానికి మిషన్‌భగీరథ నీరును సరఫరా చేసి సమస్యను పరిష్కరించాలని గ్రామ సర్పంచుతో పాటు గ్రామ ప్రజలు కూడ కోరుతున్నారు.

## కమనీయం గోదాదేవి కల్యాణం.. భక్తుల పూజలు

ఘట్‌కేసర్, జనవరి 16, ప్రభాతవార్త: ఎదులాబాద్‌లో సోమవారం శ్రీగోదాదేవి కళ్యాణోత్సవం కన్నులపండువలా జరిగింది. సంక్రాతి పర్వదినం రోజు శ్రీఆండాల్ మన్నార్‌రంగనాయకస్వామి ఆలయ ఆవరణలోని మండపాన్ని ప్రత్యేకంగా అలంకరించి అమ్మవారి కల్యాణం జరిపించారు. ధనుర్మాసం ముగింపు సందర్భంగా శ్రీగోదాదేవి, రంగనాయక స్వామిల ఉత్సవమూర్తులకు వేదపండితుల మంత్రోచ్చారణాల మధ్య కళ్యాణం ఘనంగా జరిగింది. మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి-కల్పన దంపతులతో పాటు పలువురు దంపతులు విచ్చేసిస్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించుకున్నారు. మండలం నుంచేగాక హైద్రాబాద్‌కు చెందిన భక్తులు విచ్చేసి గోవిందనామ స్మరణతో పాల్గొని కళ్యాణం తిలకించారు. ధర్మకర్తలు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణి చేశారు. పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో కళ్యాణాన్ని తిలకించారు. ఎమ్మెల్యే మల్లారెడ్డి, ఎంపిపి సుదర్శన్‌రెడ్డిలను ధర్మకర్తలు సత్కరించి ఆశీర్వచనం అందజేశారు. ఈసందర్భంగా భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. సాయంత్రం ఉత్సవమూర్తుల ను పల్లకిలో ఊరేగించగా భక్తులు సేవలో పాల్గొన్నారు. మంగళవారం సాయంత్రం శ్రీగోదాదేవి (అండాళ్) అభిషేకం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో గత నెలరోజులుగా జరుగుతున్న ధనుర్మాస ఉత్సవాలు ముగిసాయి. ఈకార్యక్రమంలో ఎంపిపి ఏనుగు ఆలయ సుదర్శన్‌రెడ్డి, సర్పంచ్ కాలేరు సురేశ్, మాజీ ఎంపిటిసి మంకం రవి, మండల బీఆర్ఎస్ ప్రధానకార్యదర్శి పన్నాల కొండల్‌రెడ్డి, గ్రామ అధ్యక్షులు అల్లం శ ంకర్, ఆలయముఖద్వార దాత బట్టె లక్ష్మణ్‌రావు, నాయకులు కాలేరు రామోజీ, చిర ంజీవి, రాజశేఖర్, ప్రవీణ్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.


**VAARTHA CLASSIFIEDS**

**CHANGE OF NAME**

★ I, Padmaja Kalgikar W/O Madan Hari R/O Plot No.52, H.No.30-473, 1st Floor, Phase-1, Prudential Bank Colony, Subhash Nagar, Secunderabad- 500015 have changed my name from Padmaja Kalgikar to Padmaja Kalgikar Madan vide Affidavit Dated:13-01-2024 before notary Mohd Hameed Khan, Secunderabad.

(Ro.No.44997)

★ నేను శ్రీమతి నేహా వ్యాస్ W/o. నరేంద్ర వ్యాస్, నా పాఠశాల రికార్డుల ప్రకారం నా పేరు కుమారి ప్రీతీ అజిత్ లాభే అని మరియు నరేంద్ర వ్యాస్‌తో వివాహం తరువాత మిస్సెస్ నేహా వ్యాస్‌గా మార్చబడిందని దీని ద్వారా తెలియచేస్తున్నాను.

(Ro.No. 45014)

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL SENIOR CIVIL JUDGE, R.R DISTRICT COURTS, AT : LB NAGAR.
O.S. No. 2459 of 2018

Between :
K. Vinod Kumar ...Plaintiff
AND
B. Santosh Kumar ...Defendant

To,
B. Santosh Kumar
S/o. B. Babu Rao,
Aged about:36 years,
Occ: Business, R/o.H.No. 14-11-57, Ghode Ki Kaber, Kamatipura, Hyderabad, T.S.

Please take notice that the above named Plaintiff has filed the above O.S.No. 2459 of 2018 against youfor specific performance and the above case is posted to **05-02-2024** for your appearance kindly appear before the above court on the above said date at 10:30 A.M. by person or through a pleader failing which the Hon'ble court will decide the matter on merits.

// BY ORDER OF THE COURT //

**M/S. A. CHANDRA SHEKAR**
**Advocates & Associates**
# 14-10-151, Lower Dhoolpet, Hyderabad. **Cell: 939 130 1466 6303937822**
**Counsel For Plaintiff**

IN THE COURT OF I JUNIOR CIVIL JUDGE : CITY CIVIL COURTS : AT : SECUNDERABAD
O.S. No. 18 of 2024

Between:
**Smt. Chanda Sridevi And Others ...PLAINTIFFS**
AND
**The Tahsildar,** Secunderabad and another **...DEFENDANTS**

To,
**All Concerned**

Take notice that **Smt. Chanda Sridevi and 2 others** have filed the above suit seeking to declare them as the legal heirs of late Chanda Srinivas.

Now the above case stands posted to **05.02.2024** for objections, If any, As such if any person has got any objection in respect of the above matter, is required to be present before the Hon'ble Court **on 05.02.2024 at 10.30 A.M.** Otherwise the matter will be proceeded further.

(BY ORDER OF THE COURT)

**Sd/- M. KESHAVA RAO**
**Advocate**
H.No.1-5-817/3, Road No.3B, New Maruthi Nagar, Kothapet, Hyderabad-500 060.
**Mobile: 9246536476.**

IN THE COURT OF VIII JUNIOR CIVIL JUDGE : CITY CIVIL COURTS : AT : HYDERABAD
O.S. No. 165 of 2024

Between:
**Sri. P. Motilal ...PLAINTIFF**
AND
**The Tahsildar,** and another **...DEFENDANTS**

To,
**All Concerned**

Take notice that **Sri. P Motilal** filed the above suit seeking to declare him as the legal heirs of his deceased wife Smt. P. Sona, who expired on 16.10.2023.

Now the above case stands posted to **15.02.2024** for objections, If any, As such if any person has got any objection in respect of the above property and or matter, is required to be present before the Hon'ble Court **on 15.02.2024 at 10.30 A.M.** Otherwise the matter will be proceeded further.

(BY ORDER OF THE COURT)

**Sd/- S. NARSIMHA REDDY**
**Advocate**
**(902/1991)**
Plot No.60/C, S.N. Reddy Nagar, Champapet, Hyderabad,
**Mobile: 94934 07003**

BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR, HYDERABAD (SOUTH)
ABR.CF. No: 350 OF 2022

BETWEEN:
**M/S MARGADARSI CHIT FUND PRIVATE LIMITED,** SANTHOSH NAGAR BRANCH, represented by its Foreman/ Branch Manager. **...Disputant**
and
**Mr. B. Ayyappa Raju & Others ...OPPONENTS**

**1. Mr. Buddharaju Ayyappa Raju** S/o B. Venkata Pathi Raju, Dob: 06/11/1981, W/As: Sales Manager, Emp.Code. SIKOF104, M/s South India Krishna Oil & Fats Private Limited, P.No.A, #8-2-684/3/J/A, IIIrd Floor, Road No.12, Banjara Hills, Hyderabad-500034. Mob. No.8374167891, R/o. F.No.101, Royal Legend Apartments, Road No.5, Krishna Nagar, Moula Ali, Hyderabad-500040.

**2. Mr. Mudunuru Narasimha Raju** S/o M. Tirupathi Raju, Dob: 05/07/1972, W/As LP (Med De Catg), Emp.Code: 24211506027, O/o Sr Dee/Trso, S C Railway, Sanchalan Bhavan, Secunderabad-500003. Mob.No. 8885670999. R/o D.No.3-5-162/201, Plot.No.229, F.No. 201, Manikanta Apartments, Road No.5, Krishna Nagar, Moula Ali, Hyderabad-500040.

**3. Mr. Gaddem Mahesh** S/o G. Lakshmi Reddy, Dob: 20/10/1984, W/As: Asst Sales Manager Bakery, Emp.Code: SIKOF699, M/s South India Krishna Oil & Fats Pvt Ltd, P.No. A, #8-2-684/3/J/A, III rd Floor, Road No.I2, Banjara Hills, Hyderabad-500034. Mob.No. 9948207773, R/o. H.No.16-2-755/D, F.No.202, Sri Lorver Nilayam, Kalyan Nagar, Dilsukhnagar, Hyderabad-500060.

**4. Mr. Dantuluri Rama Raju** S/O D. Venkata Krishnam Raju, Dob: 04/04/1979, Occ: Prop, M/s Sahasra Technical Services, H.No.40-384/1/11, Flat No.351/A/13, Jawahar Nagar, Moula Ali, Hyderabad-500040. Mob.No: 8897735999, R/o. P.No.100, 3rd Floor, Mulka Residency, CBR Krishna Veni Estates, Yapral, Secunderabad-500014.

Please take notice that the above dispute is filed against you for recovery of **Rs.2,60,946/-** (Rupees Two Lakhs Sixty Thousand Nine Hundred Forty Six only) same is posted to **30/01/2024** to your appearance before the Office of Deputy Registrar of Chits Arbitrator, HYDERABAD (SOUTH) at 03:00 pm If you fail to attend the Office of Deputy Registrar of Chits / Arbitrator on that day the matter will be heard and decided exparte.

//BY ORDER OF THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR//

**Sd/- FOREMAN/SR.BRANCH MANAGER FOR DISPUTANT COMPANY**

## భక్తి శ్రద్ధలతో శ్రీ గోదాదేవి కళ్యాణం



కళ్యాణం నిర్వహిస్తున్న పురోహితులు

హైదరాబాద్, జనవరి 16 ప్రభాతవార్త: గోదాదేవి కళ్యాణ మహోత్సవం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. డివిజన్ వాసవి కాలనీలోని శ్రీ అష్టలక్ష్మి దేవాలయం లో ధనుర్మాస వ్రత మహోత్సవం సందర్భంగా గత నెల 17వ తేదీ నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఉత్సవాలలో భాగంగా శ్రీ గోదాదేవి కళ్యాణ మహోత్సవాన్ని భక్తుల కోలాహలం మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించారు. అమ్మవారి కళ్యాణం తిలకించేందుకు భక్తులు తరలివచ్చారు. కార్యక్రమంలో దేవాలయ కమిటీ ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

## ఓల్డ్ మలక్‌పేట శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఘనంగా గోదాదేవి కళ్యాణం



గోదాదేవి కళ్యాణాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

మలక్‌పేట, జనవరి 16 ప్రభాతవార్త: ఓల్డ్ మలక్‌పేట మున్సిపల్ కాలనీలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీ గోదాదేవి కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ ఉమారెడ్డి, ఆలయ ఈవో జోషి మార్గదర్శనం సమక్షంలో కళ్యాణం జరిగింది. ఆలయ ప్రాంగణం మామిడి తోరణాలు, పూలమాలలతో అలంకరించిన పందిట్లో ఉత్సవ విగ్రహాలను ప్రతిష్ఠించి అశేష భక్తుల సమక్షంలో ఆలయ పూజారులు శ్రీనివాస చార్యులు, రామాచారి కళ్యాణ కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో జరిపించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోచమ్మ దేవాలయం ప్రతినిధి కొమిరెల్లి రామశేఖర్‌రెడ్డి, మల్లికార్జున స్వామి దేవాలయ చైర్మన్ చౌటి రవికుమార్, మదన్‌రెడ్డి, లీగల్ చందు, భావన, రజిని, లావణ్య, ఉషాగోపాలరావు పాల్గొన్నారు.

## బైక్ అదుపుతప్పి పడిపోవడంతో వ్యక్తి మృతి

హయత్‌నగర్, జనవరి 16 ప్రభాతవార్త: బైక్ అదుపు తప్పి కిందపడడంతో వ్యక్తి దుర్మరణం పాలయిన సంఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ కేంద్రం వినాయకనగర్ కాలనీకి చెందిన శ్యామల వెంకటరెడ్డి(43)ఈనెల 15న సాయంత్రం 6.30 గంటల సమయంలో బైక్(టిఎస్07 కెడి 0635)పై హయత్‌నగర్ నుంచి పెద్దఅంబర్‌పేటకు వస్తున్నాడు. సంఘం హోటల్ సమీపంలో రోడ్డు దాటుతున్న గుర్తు తెలియని వ్యక్తిని అతను బైక్‌తో ఢీకొట్టాడు. సంఘటనలో బైక్ అదుపు తప్పడంతో అతను రోడ్డుపక్కన డివైడర్‌పై పడిపోయాడు. ప్రమాదంలో అతని తలకి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే సమీపంలోని వారు అతన్ని చికిత్స కోసం హయత్‌నగర్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అతన్ని పరీక్షించిన వైద్యులు అప్పటికే అతను మృతి చెందినట్లుగా నిర్ధారించారు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## అనాథ చిన్నారులకు పతంగుల పంపిణీ



అనాథ చిన్నారులకు గాలిపటం పంపిణీ చేస్తున్న శ్రీకాంత్ తదితరులు

ఉప్పల్, జనవరి 16 ప్రభాతవార్త: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కించుకుని ఉప్పల్ పంగా స్వరూప్‌రెడ్డి కాలనీలోని అభిసాయి దత్తా ఆశ్రమ చిన్నారులకు బీఆర్ఎస్ పార్టీ ఉప్పల్ డివిజన్ ఎస్సీ సెల్ అధ్యక్షులు చిలుగూరి శ్రీకాంత్ సోమవారం గాలి పటాలు(పతంగులు), దారం, చేరాక్‌లను పంపిణీ చేశారు. గాలి పటాలు స్వీకరించిన చిన్నారులు అమిత ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ.. నా అనేవారు లేని పిల్లల్లో అన్నదాన్ని చూడటం మనకు మరింత ఆనందాన్ని ఇస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు నేతలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సీనియర్ మైనార్టీ నేత సమద్ బిన్ సిద్దిఖీ మృతి

సరూర్‌నగర్, జనవరి 16 ప్రభాతవార్త: మహేశ్వరం నియోజకవర్గం జల్‌పల్లి మునిసిపాలిటీ కొత్తపేట్ ఎర్రకుంటకు సీనియర్ నాయకుడు సమద్ బిన్ సిద్దిఖీ (48) ఆకస్మిక మృతి చెందారు. కొత్తపేట్ గ్రామ పంచాయతీకి వార్డు సభ్యునిగా పని చేసి ఆ తర్వాత తన సోదరిని ఎంపిసిటి గెలిపించుకున్న సిద్దిఖీకి మున్సిపాలిటీలో మంచి పేరుంది. అయితే అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఓపెన్ హార్ట్ సర్జరీ చేయించుకున్న ఆయన గత ఆదివారం అస్వస్థతకు గురై చికిత్సనిమిత్తం ఆసుపత్రికివెళ్ళి అక్కడ తుదిశ్వాస విడిచాడు. ఎంఐఎం, కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీల్లో క్రియాశీలకంగా పని చేసి వివాదరహితునిగా పేరున్న సమద్ మృతి పట్ల రాజకీయాలకతీతంగా పలువురు విచారం వ్యక్తం చేశారు. అంత్యక్రియలు సోమవారం బార్కాస్ స్మశానవాటికలో జరిగాయి.

## చిన్న వయసులో షుగర్ వ్యాది.. బాధితురాలికి అండగా ఎమ్మెల్యే బిఎల్ఆర్



ఖాజామొయుద్దీన్‌కు ఎల్ఓసీ పత్రాన్ని అందజేస్తున్న కార్పోరేటర్ శాంతి శేఖర్

నాచారం, జనవరి 16 ప్రభాతవార్త: నాచారం డివిజన్‌కు చెందిన నిరుపేద అయిన ఖాజామొయిద్దీన్ కుమార్తె జెబా ఫాతిమా(10) కు చిన్న వయసులోనే షుగర్ వ్యాది వచ్చింది. దీంతో పాప తండ్రి కార్పోరేటర్ శాంతి సాయిజన్ శేఖర్‌ను కలిశారు. వెంటనే స్పందించిన కార్పోరేటర్ ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని సంప్రదించారు. ఆయన వెంటనే స్పందించి రూ. 1,50,000 ఎల్ఓసీ ఇప్పించారు. మంగళవారం బీఆర్ఎస్ నాయకులు, కార్పోరేటర్ శాంతి సాయిజన్ శేఖర్ పాప తండ్రి మొయిద్దీన్‌కు వారు ఎల్ఓసీ పత్రాన్ని అందజేయడంతో వారు ఎంతో సంతోషం వ్యక్తం చేశారు.

## రాహుల్ భారత్ జోడో న్యాయ్ యాత్ర నిరాటంకగా సాగాలి: నవారు మల్లారెడ్డి




కారుకు రాహుల్ యాత్ర పోస్టర్‌ను అతికిస్తున్న నవారు మల్లారెడ్డి

సరూర్‌నగర్, జనవరి 16 ప్రభాతవార్త: దేశంలో సామాజిక న్యాయం, పదేళ్ళ అన్యాయం, ధరల పెరుగుదల, నిరుద్యోగం తదితర అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్ళే ఉద్దేశ్యంతో ఎఐసిసి అగ్ర నాయకుడు రాహుల్ గాంధీ మణిపూర్ నుండి ముంబాయి వరకు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భారత్ జోడో న్యాయ్ యాత్ర సఫలం కావాలని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు నవారు మల్లారెడ్డి ఆకాంక్షించారు. రాహుల్ గాంధీకి మద్దతుగా ఆయన పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి తన కారుకు భారత్ జోడో న్యాయ యాత్రకు సంబంధించిన పోస్టర్‌ను అతికించారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ గత సంవత్సరం కన్యాకుమారి నుండి కాశ్మీర్ వరకు రాహుల్ గాంధీ జరిపిన తొలి విడత భారత్ జోడో యాత్రకు తెలంగాణతో పాటు వివిధ రాష్ట్రాల ప్రజలు బ్రహ్మరథం పట్టారని గుర్తు చేశారు. అప్పట్లో యాత్ర విజయవంతం అయినట్లే ఈ సారి రెండవ విడతది కూడా జయప్రదం అవుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. వంద లోక్‌సభ నియోజకవర్గాల గుండా సుమారు 6 వేలకు పైగా కిలోమీటర్ల మేర రాహుల్ చేస్తున్న యాత్రకు ప్రజలు సంఘీభావం తెలిపి స్వాగతిస్తారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకుడు రామడి శ్రీనివాస్‌రెడ్డి, కొవ్వూరు రాకేశ్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు బడంగ్‌పేట్ జడ్పీహెచ్ఎస్ విద్యార్థిని



రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన లక్ష్మి

సరూర్‌నగర్, జనవరి 16 ప్రభాతవార్త: బాలాపూర్ మండలంలోని బడంగ్‌పేట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన తొమ్మిదవ తరగతి విద్యార్థిని డాకూరి పార్వతి రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైంది. ఇటీవల కీసరలో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొని చక్కని ప్రతిభ కనబరిచినందుకు లక్ష్మిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కోరని అర్జున్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాలకు పేరు తీసుకు వస్తున్న లక్ష్మిని అభినందించారు. రాష్ట్ర స్థాయిలో కూడా లక్ష్మి మంచి ప్రతిభ కనబరుస్తుందని ఆయన పేర్కొన్నారు.

## భూగర్బ డ్రైనేజీ సమస్య పరిష్కరించాలి : మాజీ కార్పొరేటర్ జ్యోష్న నాగేశ్వరరావు

రామంతాపూర్, జనవరి 16 ప్రభాతవార్త : రామంతాపూర్ డివిజన్‌లో డ్రైనేజీ సమస్య పరిష్కరించాలని మాజీ కార్పొరేటర్ గంధం జ్యోష్న నాగేశ్వర్‌రావు పేర్కొన్నారు. ఈ మేరకు జలమండలి జీఎం సంతోష్‌కుమార్, ఇతర అధికారులను కలిసి పలు సమస్యలను వివరించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ రామంతాపూర్ డీమార్ట్ వెనుక నుంచి డ్రైనేజీ లైన్లు వేయాలని, మెట్ల గల్లీలో కొత్త పైప్‌లైన్లు వేయాలని కోరారు. శ్రీనగర్ కాలనీ నుంచి ఇందిరానగర్‌లో బకెట్ మిషన్‌తో పనులు చేపట్టాలని కోరారు. గత రెండు సంవత్సరాలుగా డ్రైనేజీతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సమస్యలపై అధికారులు సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నేతలు మధుసూధన్‌రెడ్డి, సంపత్‌రావు, ఆలే రమేష్, మున్నా తదితరులు పాల్గొన్నారు.

## నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ దయానంద్‌గుప్త, కార్పొరేటర్ పవన్

హైదరాబాద్, జనవరి 16 ప్రభాతవార్త: కొత్తపేట డివిజన్ మారుతినగర్‌లో యాదవ సంఘం అధ్వర్యంలో నూతన సంవత్సరం క్యాలెండర్‌ను ఎమ్మెల్సీ దయనందగుప్తా, కొత్తపేట కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్, ఎల్బీనగర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ లింగాల నాగేశ్వరరావు, కొత్తపేట డివిజన్ టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు లింగాల రాహుల్‌గౌడ్, జోగుపర్తి వెంకటేష్‌గుప్తా ముఖ్యఅతిథులుగా హాజరై ఆవిష్కరించారు. నూతన సంవత్సరంలో అందరికీ శుభం కలగాలని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ చైతన్యపురి డివిజన్ అధ్యక్షుడు తోట మహేష్‌యాదవ్, యాదవ సంఘం తోట శ్రీనివాస్‌యాదవ్, తోట క్రిష్ణయాదవ్, పి.గోపాల్ యాదవ్, సురేష్‌యాదవ్, వెంకటేష్‌యాదవ్, మంచి రాజేష్ పాల్గొన్నారు.

## అస్మాన్‌ఘడ్ డివిజన్ 11 కెవి ఫీడర్ల పరిధిలో నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మలక్‌పేట, జనవరి 16 ప్రభాతవార్త: అస్మాన్‌ఘడ్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మెయింటనెన్స్ వర్క్స్, ట్రీ కటింగ్ నేపథ్యంలో బుధవారం కొద్ది గంటలపాటు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని విద్యుత్ శాఖ డిఇ హనుమంతరెడ్డి తెలిపారు. 11 కెవి దర్గా ఫీడర్ పరిధిలో ఉదయం 9గంటల నుండి 11 గంటలవరకు దర్గా, రియాసత్‌నగర్, ఇందిరానగర్, హబీబ్‌నగర్, మొయిన్‌బాగ్, జవహర్‌కాలనీ, ఫతేష్‌నగర్, దర్గా భారాలి, రవూఫ్‌నగర్, జమాల్‌కాలనీ, రాజునగర్ అబుబాకర్ మస్క్ ప్రాంతాలు, 11 కెవి ఐఎస్‌సదన్ ఫీడర్ పరిధిలో ఓల్డ్ అడ్ న్యూ సంతోష్‌నగర్, ఓవైసినగర్, హస్నాబాద్, రాయల్ సి హోటల్, సన టీ పాయింట్, సరళదేవినగర్, కెనరాబ్యాంక్, తర్కారీ పాయింట్, క్రిస్టల్ బార్ వీధి, ఐఎస్‌సదన్ మెయిన్‌రోడ్, 11 కెవి జిఎంనగర్ విద్యుత్ ఫీడర్ పరిధిలో ఉదయం 11 గంటలనుండి ఒంటి గంటలవరకు జిఎంనగర్, కింగ్ హౌస్ హోటల్, దోబీఘాట్, లంబాడి బస్తీ, ఒవైసీ ఆసుపత్రి మెయిన్‌రోడ్డు, జఫరియా మాజీద్ ప్రాంతాలు, 11 కెవి జమాల్‌కాలనీ విద్యుత్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 గంటలనుండి 4 గంటలవరకు రవూఫ్‌నగర్, జమాల్ కాలనీ, రాజు నగర్, అబుబాకర్ మాస్క్, లలితాబాగ్, మొయిన్‌బాగ్, చిల్డ్రన్ బాగ్, రక్షణపుర టింబర్ డిపో, అక్తార్ పాయింట్ ప్రాంతాలు, 11 కెవి జహంగీర్ నగర్ విద్యుత్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 4 గంటలనుండి సాయంత్రం 6 గంటలవరకు ఒవైసినగర్, ఫతేషనగర్, హుస్సేనీ కేఫ్, మహ్మద్ ఫంక్షన్ హాల్, ముబారక్ దౌలా తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని తెలిపారు.

## పెట్రోల్ బంకుల్లో వినియోగదారుడే ముఖ్యఅతిథి : మాచన రఘునందన్



పెట్రోల్ బంకులో పెట్రోల్ ఫిల్లింగ్ మెషిన్‌ను పరిశీలిస్తున్న రఘునందన్

తుర్కయంజాల్, జనవరి 16 ప్రభాతవార్త: పెట్రోల్ బంక్‌ల్లో వినియోగదారులకు ఇంధన నాణ్యత, పరిమాణంలాంటి కనీస సౌకర్యాలను బంక్‌ల్లో ఉంచి తీరాలని వినియోగదారుల వ్యవహారాలు, పౌర సరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసిల్దార్ మాచన రఘునందన్ స్పష్టం చేశారు. బుధవారం ఆయన సాగర్ రోడ్డులో తుర్కయంజాల్ మున్సిపాలిటీ రాగన్నగూడలో పెట్రోల్ బంక్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రఘునందన్ మాట్లాడుతూ వినియోగదారులకు కనీస సౌకర్యాలను కల్పించడంలో బంకులు నిర్లక్ష్యంగా ఉన్నా.. భాధ్యత విస్మరించినా చర్యలు తీసుకుంటామని, తేడాలుంటే రూ. 25వేలవరకు జరిమానా విధిస్తామన్నారు. పెట్రోల్‌బంక్‌ల్లో ఇంధననాణ్యతను పరీక్షించేందుకు బ్లాటింగ్ పేపర్స్ అందుబాటులో ఉంచాలన్నారు. పెట్రోల్‌లో కల్తీ ఉందన్న అనుమానం వస్తే ఇంధనాన్ని ఫిల్టర్ పేపర్‌పై పోసి కల్తీని పసిగట్టవచ్చునన్నారు. తమ అనుమానాలను నివృత్తి చేసుకునే అవకాశం వినియోగదారులకు ఉందని ఆయన స్పష్టం చేశారు. అంతే కాకుండా పెట్రోల్ బంక్‌ల్లో మరుగుదొడ్లు శుభ్రంగా ఉంచాలన్నారు. దుర్గంధ భరితంగా ఉంటే పెట్రోల్ బంక్‌ల్లో సేల్స్ ఆఫీసర్ నంబర్ తీసుకుని వారికి ఫిర్యాదు చేయాలని సూచించారు. స్థానిక తహసిల్దార్, ఆర్డీఓ లేదా ఆపై స్థాయి ఉన్నతాధికారులకు సమాచారం ఇస్తూ.. ఫిర్యాదు చేయాలని సూచించారు.

## ఉప్పల్ న్యూ భరత్‌నగర్‌లో డ్రైనేజీ పనులు

ఉప్పల్, జనవరి 16 ప్రభాతవార్త : ఉప్పల్ న్యూభరత్‌నగర్ భూలక్ష్మి ఆలయం వద్ద కొత్తగా చేపడుతున్న భూగర్భ డ్రైనేజీ పనులను స్థానిక కార్పొరేటర్ మందముల్ల రజిత పరమేశ్వర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భం గా ఆమె మాట్లాడుతూ భూలక్ష్మి దేవాలయం వద్ద కొత్తగా డ్రైనేజీ లైన్లు ఏర్పాటు చేయిస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు మౌళిక సదుపాయాలు కల్పించడమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. పనులు సకాలంలో పూర్తి చేసి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని కోరారు. ఈ సందర్భంగా కాలనీలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కాలనీ నేతలు కడిగె శేఖర్, సల్ల ప్రభాకర్‌రెడ్డి, కాంగ్రెస్ నేతలు లింగంపల్లి రామకృష్ణ, సుంకు శేఖర్‌రెడ్డి, వెంకటేష్, పాలడుగు లక్ష్మణ్, సల్ల రాజేందర్‌రెడ్డి, ప్రశాంత్ రెడ్డి, రామ్, దుర్గారెడ్డి, హరిశంకర్,ప్రభాకర్, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

## రామంతాపూర్‌లో కురుమ సంఘం క్యాలెండర్ అవిష్కరణ

ఉప్పల్, జనవరి 16 ప్రభాతవార్త : కురుమలు అర్థికంగా, సామాజికంగా రాణించాలని ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య పేర్కొన్నారు. ఈ మేరకు రామంతాపూర్ వెంకట్‌రెడ్డినగర్‌లో కురుమ సంఘం క్యాలెండర్‌ను ఆయన ముఖ్య అతిథిగా హాజరై అవిష్కరించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కురుమలు అర్థికంగా, సామాజికంగా రాణించాలని, ప్రభుత్వంనుంచి వారిని తగుచేయూత అందిస్తామన్నారు. కురుమలకు ప్రత్యేకంగా స్థలం కేటాయించి కమ్యూనిటిహాల్ నిర్మించాలని సూచించారు. అనంతరం కురుమ యువత సంఘం ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతి సందర్భంగా చిన్నారులకు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎపిపి యాదగిరి, పిసిసి కార్యదర్శి శివకుమార్, సంఘం రాష్ట్ర కార్యదర్శి గొరిగె మల్లేష్, ఉప్పల్ జోన్ అధ్యక్షుడు రేవు కృష్ణయ్య, వెంకట్‌రెడ్డినగర్ అధ్యక్షుడు అల్లం కొమరయ్య, కార్యదర్శి వెంకటేష్, ఐలయ్య, బాబు, సత్యనారాయణ, శ్రీనివాస్, మంగ వెంకటేష్, శ్రీశైలం, సత్తయ్య, పలువురు కురుమ సంఘం నేతలు పాల్గొన్నారు.

## బీసీలకు అధిక బడ్జెట్ కేటాయించాలి

హైదరాబాద్, జనవరి 16 ప్రభాతవార్త: బీసీల కులవృత్తులను దృష్టిలో పెట్టుకుని బడ్జెట్లో అధిక మొత్తంలో బడ్జెట్ కేటాయించాలని, బీసీ బందు అమలు చేయాలని వంశరాజ్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు శ్యామలయాదగిరి, నాయి బ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షులు రాచమల్ల బాలకృష్ణ డిమాండ్ చేశారు. శ్యామలయాదగిరి ఆధ్వర్యంలో నాగోల్ డివిజన్ జయపూరి కాలనీలో బిసి చేతివృత్తిదారుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ఎంపికైన లబ్ధిదారులకు లక్ష రూపాయల చెక్కులు ఇవ్వాలని కోరారు. చేతి వృత్తిదారులకు అండనిచ్చేందుకు గత ప్రభుత్వం బీసీబందు పథకాన్ని అమలు చేసిందని, ఆ పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలన్నారు. ఈ పథకం ద్వారా చేతి వృత్తులకు ఎంతో ప్రయోజనం చేకూరుస్తుందని, ముడి సరుకులు, యంత్ర పరికరాల కొనుగోలుకు ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్ర మంలో నాయిబ్రాహ్మణ సంఘం రాష్ట్ర ప్రచారకార్యదర్శి దుబాయ్ నరసింహులు, రాష్ట్ర నాయకులు మావిళ్ళ సాయి, పగిడిమర్రి శంకర్, మనోజ్‌గౌడ్, శ్రీనివాస్, యాదిలాల్, వేణుగోపాల్, కస్తూరి, అశోక్, నరసింహయాదవ్, శివకుమార్‌యాదవ్, కిరణ్‌గౌడ్ పాల్గొన్నారు.

## అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి : కార్పొరేటర్ పవన్‌కుమార్

హైదరాబాద్, జనవరి 16 ప్రభాతవార్త: అభివృద్ధి పనుల విషయంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్ కుమార్ పేర్కొన్నారు. ఎస్ఆర్ఎల్ కాలనీలో పర్యటించిన కార్పొరేటర్ కాలనీలో వేస్తున్న నూతన బాక్స్ డ్రైనేజీ లైన్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాక్స్ డ్రైనేజ్ పనులు త్వరగా పూర్తి చేయాలని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు పాటించాలని అధికారులకు సూచించారు. అనంతరం డ్రైనేజ్ సమస్యలను పరిశీలించారు. జలమండలి అధికారులతో మాట్లాడి సమస్యలన్నీ పరిష్కరించే విధంగా చూస్తామని కాలనీ వాసులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు సుధాకర్, యాదయ్య, శ్రీనివాస్‌రావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## అనుమానాస్పద స్థితిలో బాలుడు మృతి



మృతి చెందిన బాలుడి మృతదేహాన్ని తరలిస్తున్న పోలీసులు (చిత్రంలో బాలుడి మృతదేహం)

కుషాయిగూడ, జనవరి 16 ప్రభాతవార్త : అనుమానాస్పద స్థితిలో ఓ బాలుడు మృతి చెందిన సంఘటన చర్లపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బీహార్ నుండి వలస వచ్చిన ప్రదీప్ కుమారుడు ప్రిన్స్ (8) స్థానిక చర్లపల్లి ప్రభుత్వ పాఠశాలలో మూడవ తరగతి చదువుతున్నాడు. సోమవారం నుండి కనిపించకుండా పోయిన బాలుడు శవమై కనిపించడంతో స్థానికంగా విషాదఛాయలు అలముకున్నాయి. సోమవారం అదృశ్యమైన ప్రిన్స్ స్థానిక చర్లపల్లి రైల్వే స్టేషన్ వెళ్తుండగా కనకదుర్గ వైన్స్ వద్ద గల చెట్ల మధ్యలో గోడ పక్కన తీవ్ర గాయాలతో పడిపోయి మృతి చెంది ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. స్థానికులు, బంధువులు అనుమానాస్పద మృతిగా పేర్కొంటుండగా గాలిపటం కోసం గోడ ఎక్కి కింద పడిపోయాడని పోలీసులు భావిస్తున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ఉప్పల్ మిని శిల్పారామంలో ఆకట్టుకున్న కళాకారుల కూచిపూడి నాట్య ప్రదర్శనలు




మినీ శిల్పారామంలో కూచిపూడి నాట్య ప్రదర్శనలు చేస్తున్న కళాకారులు

ఉప్పల్, జనవరి 16 ప్రభాతవార్త: ఉప్పల్ మినీ శిల్పారామంలో కనుమ పండుగ పురస్కరించుకొని శిల్పారామం ఆవరణలో మంగళవారం గంగిరెద్దులు, హరిదాసులు, బుడబుక్కల, జంగమదేవరులు విన్యాసాలు ఎంతగానో అలరించాయి. పేరిణి శ్రీనివాసరావు శిష్య బృందం ప్రదర్శించిన ఆంధ్ర నాట్యం ప్రదర్శన ఆధ్యంతం అలరించింది. అలరింపు, వినాయక కౌత్వం, గంగాధర, అగణిక, నమో నాథ, నిన్ను మించి , దేవి స్తుతి, నవగ్రహాలు, ప్రవేశ దరువు మొదలైన అంశాలను సహస్ర,వీరిష, ప్రశాంతి, మైత్రి, సాన్విక, సచిత, శ్రీహిత, నైనికా, నేత్ర, తన్మయి, కీర్తన, భవ్య, భావన, ప్రియాంక మొదలైన వారు ప్రదర్శించి మెప్పించారు.

## శివసాయినగర్‌లో గో మాతకు సీమంతం



గోమాతకు సీమంతం చేస్తున్న శివసాయినగర్ మహిళలు

సరూర్‌నగర్, జనవరి 16 ప్రభాతవార్త: మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని శివసాయినగర్ కాలనీలోనున్న శ్రీ గౌరి నీలకంఠేశ్వర స్వామి సమేత శ్రీ లక్ష్మీ గణపతి ఆలయ ప్రాంగణంలో గోమాతకు సీమంతం జరిపి కాలనీ మహిళలు ఆవు పట్ల ఉన్న భక్తిని చాటుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో లక్ష్మి, మీనాక్షి, సుశీల, సుజాత, విజయ, లీలావతి, సౌమ్యశ్రీ తదితరులు భక్తి శ్రద్ధలతో ఆవుకు పూజ చేసి పండ్లు, పూలు సమర్పించి మంగళహారతులు ఇచ్చి సీమంతం చేశారు. కాగా సంక్రాంతి వేడుకల్లో భాగంగా ఆలయ కమిటీ వారు కాలనీలో గో సంరక్షకుడు కోటయ్యతో గంగిరెద్దుచే విన్యాసాలు చేయించి పండుగ సాంప్రదాయాన్ని చాటారు.

## హరిహర క్షేత్రంలో భాగ్యనగర్ సొసైటీ చైర్మన్ మర్రి నర్సింహారెడ్డి పూజలు



హరిహర క్షేత్రంలో పూజలు చేసిన భాగ్యనగర్ చైర్మన్ మర్రి నర్సింహారెడ్డి

సరూర్‌నగర్, జనవరి 16 ప్రభాతవార్త: సంక్రాంతి సందర్భంగా రైతులు బాగుండాలని భాగ్యనగర్ రైతు సేవా సహకార సంఘం చైర్మన్ మర్రి నర్సింహారెడ్డి కర్మన్‌ఘాట్‌లోని హరిహర క్షేత్రం అయ్యప్ప స్వామి దేవాలయంలో పూజలు చేశారు. రైతుల పంటలను కరువు కాటకాల నుండి కాపాడాలని ఆయన కోరుతూ ఆయన పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం సంక్రాంతి పర్వదినం సందర్భంగా రైతుల కోసం తాను ఆలయాల్లో పూజలు చేస్తానని ఆయన పేర్కొన్నారు.

## ఘనంగా సంక్రాంతి ముగ్గుల పోటీలు విజేతలకు బహుమతులు : సర్పంచ్ మనీష్‌గౌడ్



ముగ్గుల పోటీల్లో సర్పంచ్ గుండు మనీష్ గౌడ్..

నేరెడ్‌మెట్, జనవరి 16 ప్రభాతవార్త: యాదాద్రి భువనగిరి జిల్లా మండలం వడాయిగూడెం గ్రామంలో కనుమ పండుగ సందర్భంగా గ్రామ సర్పంచ్ గుండు మనీష్‌గౌడ్ ఆధ్వర్యంలో ఎంపిటిసి రాంపల్లి క్రిష్ణ సారధ్యంలో బోడ్రాయి వద్ద ముగ్గుల పోటీలను నిర్వహించారు. సుమారు 120 మంది మహిళలు, యువతులు తమ తమ మగ్గులను రంగు రంగులతో వేసి అందరిని ఆకట్టుకున్నారు. ఉత్తమ ముగ్గులను ఎంపిక చేసి ప్రథమ, ద్వితీయ, తృతియ బహుమతులతో పాటు కుక్కర్లు, ముత్యాల హారాలు, స్మార్ట్ గడియారాలతో పాటు పాల్గొని ప్రతి ఒక్కరికి సుమారు రూ. 500 విలువ చేసే చీరలను అందించారు. మొదటి బహుమతి రంగ శిరీషాకు 15తులాల వెండి, రెండవ బహుమతి కళ్ళెం ప్రవలికకు 10తులాల వెండి, తృతియ బహుమతి తాడెం సునీతకు 5తులాల వెండిలను అందించారు. ఈ కార్యక్రమంలో గుండు ముత్తయ్య గౌడ్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్ళెం క్రిష్ణగౌడ్, బి.ఆర్.ఎస్ గ్రామ కార్యదర్శి జక్కుల చంద్రయ్య, బీజెపి గ్రామశాఖ అధ్యక్షులు బబ్బురి సురేష్ గౌడ్, పలువురు యూత్ అసోసియేషన్ సభ్యులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



కొత్తపేట డివిజన్ సత్యానగర్ కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీలలో మహిళలు పెద్ద ఎత్తున హాజరై పలు రకాల అందమైన ముగ్గులను వేశారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన మహిళలకు బహుమతులు అందజేసినట్లు సంక్షేమ సంఘం సభ్యులు తెలిపారు.( హైదరాబాద్, ప్రభాతవార్త)